# ప్రజా తపన

prajathapana.com

News that matters




అల్పమైన విషయాలకై ప్రార్థించకండి, శరీర సుఖాల కోసం తాపత్రయపడితే మనుషులకు, జంతువులకు వ్యత్యాసం ఏముంటుంది?

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 38 మంగళవారం 21 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# మోదీ లాక్షియన్ చైనాలో విపరీత ప్రేమ

**బీజింగ్ :**

ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా ఏడుసార్లు..డబుల్ హ్యాట్రిక్.. అయినా ఆయన మేనియా తగ్గలేదు. గత రికార్డులన్నీ తిరగరాస్తూ మరోసారి బంపర్ మెజార్టీ సాధించి చరిత్ర సృష్టించారు. అధికారాన్ని కొనసాగిస్తున్న బీజేపీకి మోదీనే బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. మోదీ వ్యతిరేక శక్తులన్నీ ఏకమైనా మోదీ మేనియా ముందు తేలిపోయారు. ఓట్లు, సీట్లు పెరగడంతోపాటు బీజేపీ జోరు అమాంతం పెరిగిపోయింది. ఇది మనం దేశంలో.. ఇప్పుడు ఆయన నామ జపం దేశం దాటింది. భారతీయులు ఎక్కువగా ఉండే అమెరికా వంది దేశాల్లో కామన్. శత్రు దేశాల్లోని జనం కూడా భారత ప్రధాని నరేంద్ర మోదీ జపం చేస్తున్నారు. మాకు మోదీ కావాలి..! మోదీ.. మోదీ.. మోదీ.. ఇప్పుడు ఆయా దేశాల్లో నమో మంత్రం మారుమ్రోగుతోంది.రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలున్నా భారత ప్రధాని మోదీకి చైనా ప్రజల్లో భారీగా ఆదరణ పెరుగుతోంది. మోదీని చైనీయులు అసాధారణ వ్యక్తిగా పరిగణిస్తున్నారని అమెరికా పత్రిక 'డిప్లొమాట్' పేర్కొంది. ఈ మేరకు ఒక భారీ స్టోరీని ప్రచూరించింది. మోదీ నాయకత్వంలోని భారత్ అగ్ర దేశాల మధ్య సమతూకం పాటిస్తోందని చైనా వ్యవహారాలను విశ్లేషించే జర్నలిస్టు ము షుంషాన్ అందులో చెప్పడం విశేషం.


(మిగతా 2లో)






# 25న ఇస్రో సహాయంతో 36 ఇంటర్నెట్ శాటిలైట్ల ప్రయోగం

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

భారతీ ఎంటర్‌ప్రైజస్ ప్రోత్సాహంతో వన్‌వెబ్ కంపెనీ .. ఇస్రో సహాయంతో 36 ఇంటర్నెట్ శాటిలైట్లను ప్రయోగించనున్నది. మార్చి 25వ తేదీన ఆ ప్రయోగం జరగనున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. గ్లోబల్ ఎల్‌ఈవో కాన్‌స్టెల్లేషన్‌లో భాగంగా ఆ ప్రాజెక్టును చేపట్టారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్నుంచి ఆ శాటిలైట్లను ప్రయోగిస్తారు. ఇప్పటి వరకు వన్‌వెబ్ సంస్థ 18 సార్లు శాటిలైట్లను ప్రయోగించింది. ఈ ఏడాది ఇది మూడవ పరీక్ష కానున్నది. 36 శాటిలైట్ల ప్రయోగం సందర్భంగా వన్‌వెబ్ కంపెనీ స్టేట్మెంట్ రిలీజ్ చేసింది. వన్‌వెబ్ చరిత్రలో ఇది ప్రతిష్టాత్మక మైలురాయిగా నిలుస్తుం దని చెప్పారు. వన్‌వెబ్ శాటిలైట్లను ఇస్రో ప్రయోగించడం ఇది రెండవసారి అవుతుంది. ఇస్రోకు చెందిన కమర్షియల్ విభాగం ఎన్‌ఎస్‌ఐఎల్‌ఈ ప్రయోగాన్ని నిర్వహి స్తుంది. లాంచ్ వెహికిల్ మార్క్-3 రాకెట్ ద్వారా .. లో ఎర్త్ ఆర్బిట్‌లోకి శాటిలైట్లను పంపనున్నారు.వన్‌వెబ్ కంపెనీ ఇటీవల స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా 40 ఇంటర్నెట్ శాటిలైట్లను ప్రయోగించిన విషయం తెలిసిందే.

# సహజీవనం చేస్తున్న జంటల నమోదు కోసం.. సుప్రీంకోర్టులో పిల్

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

పెళ్లి చేసుకోకుండా కలిసి జీవిస్తూ, సహజీవనం చేస్తున్న జంటల నమోదు కోసం నిబంధనలు, మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ ఒక న్యాయవాది సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశాడు. సోమవారం దీనిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, పిటిషన్‌దారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుందేలు తెలివి మాదిరిగా ఈ ఆలోచన ఉందన్నారు. ఈ పిటిషన్‌ను తిరస్కరించారు.దేశ


(మిగతా 2లో)




# ఉద్రిక్తంగా మారిన ఏపీ అసెంబ్లీ



**విజయవాడ:**

ఏపీ అసెంబ్లీలో ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు మధ్య ఘర్షణ జరిగింది. శాసనసభలో చర్చ జరుగుతుండగా టీడీపీ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. దీనిపై వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వైసీపీకు చెందిన


(మిగతా 2లో)




# అమృత్ పాల్ సింగ్ కు పాక్ నుంచి నిధులు

**ఛండీఘడ్ :**

పరారీలో ఉన్న ఖలిస్థాన్ వేర్పాటు ఉద్యమ నేత అమృత్ పాల్ సింగ్ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు పంజాబ్ పోలీసులు. నలుగురు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే కీలక ఆధారాలు లభించినట్టు పోలీసులు చెబుతున్నారు. అమృత్ పాల్‌కు పాకిస్థానీ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐతో సంబంధాలున్నట్టు వెల్లడించారు. అమృత్‌సర్ డీఐజీ స్వపన్ శర్మ ఈ సంచలన ప్రకటన చేశారు. అమృత్ పాల్‌ను అరెస్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అతడిని ఛేజ్ చేశాం. మమ్మల్ని ఓవర్ టేక్ చేస్తూ ఆరు బైక్‌లను ఢీకొడుతూ వెళ్లిపోయాడు. కొందరు మమ్మల్ని ఆపేందుకు ప్రయత్నించారు. అలా మా కళ్లు గప్పి తప్పించుకున్నాడు. మెహత్‌పూర్‌లో రెండు కార్లు స్వాధీనం చేసుకున్నాం.


(మిగతా 2లో)


# 22న తిరుమలలో అస్థానం



**తిరుమల:**

తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది వేడుకలను తిరుమల శ్రీవారి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా మార్చి 22న శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది. అంతకుముందు మార్చి 21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరపనున్నట్లు పేర్కొంది. ఈ కారణంగా 21, 22వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయనున్నారు. అలాగే మార్చి 20, 21వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 22వ తేదీన శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందుగా ఉదయం 3 గంటలకు సుప్రభాతం, నిర్వహించి అనంతరం ఆలయ శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుండి 9 గంటల మధ్య విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేస్తారు. అనంతరం పంచాగ శ్రవణం నిర్వహిస్తారు. అనంతరం బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ద్ద ఉగాది ఆస్థానాన్ని నిర్వహిస్తారు.ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 22వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని కూడా నిలిపివేసినట్లు టీడీడీ సూచించింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని టీటీడీ అధికారులు కోరుతున్నారు.

## మోదీ లాక్షియన్ చైనాలో విపరీత ప్రేమ

(మొదటిపేజీ తరువాయి)

'మోదీ లాక్షియన్' అని చైనీయులు సామాజిక మాధ్యమాల్లో మోదీకి పేరు పెట్టుకున్నారు. అసాధారణ సామర్థ్యమున్న దివ్య పురుషుడు అని దాని అర్థం. మోదీ మిగిలిన నేతలకన్నా విభిన్నంగా ఉంటారని ఆయన విశ్లేషించారు. మోదీ వస్త్రధారణ, రూపం అసాధారణంగా ఉంటాయని.. ఆయన విధానాలూ గత నేతలకన్నా భిన్నంగా ఉంటాయని చైనీయులు చెప్పు కోవడం విశేషం.రష్యా, అమెరికా, దక్షిణ దేశాలతో మోదీ స్నేహంగా ఉంటారనేది చైనీయుల అభిప్రాయమని చైనా జర్నలిస్ట్ షంషాన్ వివరించారు. 20ఏళ్ల నుంచీ అంతర్జాతీయ మీడియా వార్తలను తాను అందిస్తున్నానని, కానీ చైనీయులు ఒక విదేశీ నేతకు ముద్దుగా.. ప్రేమతో ఇలా పేరు పెట్టడం ఎప్పుడూ చూడలేదని.. వినలేదని పేర్కొన్నారు.చైనీయుల దృష్టిలో ప్రధాని మోదీకి ఓ ప్రత్యేక స్థానముందని అన్నారు షంషాన్. చైనాలో ట్విటర్‌కు పోటీగా వచ్చిన 'సైనా వీబో'లో మోదీ 2015లో చేరారు. ఆయనకు 2.44 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. అయితే చైనా యాప్‌లపై నిషేధంలో భాగంగా 2020 జులై తర్వాత ఆయన తన ఖాతాను మూసేశారు.

## సహజీవనం చేస్తున్న జంటల నమోదు కోసం.. సుప్రీంకోర్టులో పిల్

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని ఢిల్లీలో సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్‌ను ఆమె ప్రియుడు అఫ్తాబ్ పూనావాలా దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. చంపిన తర్వాత ఆమె శరీర భాగాలను ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచి ఆ తర్వాత పలు ప్రాంతాల్లో పడేశాడు. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. ఆ తర్వాత ఇలాంటి తరహా సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.ఈ నేపథ్యంలో ఒక న్యాయవాది సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశాడు. దేశంలో సహజీవనం చేస్తున్న ప్రతి జంట తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకునేలా మార్గదర్శకాలు, నిబంధనలు జారీ చేయాలని కోర్టుకు విన్నవించాడు. కలిసి జీవిస్తున్న జంటలకు ఆ మేరకు సామాజిక భద్రత కల్పించాలని కోరాడు. లివ్ ఇన్ భాగస్వాముల వల్ల జరిగే నేరాలను ఈ ఆలోచన తగ్గిస్తుందని పేర్కొన్నారు.కాగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ పిల్‌పై మండిపడ్డారు. సహజీవనం చేస్తున్నవారు ఎవరి వద్ద రిజిస్టర్ చేసుకోవాలి? కేంద్ర ప్రభుత్వం వద్దా? లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న వ్యక్తులతో కేంద్ర ప్రభుత్వానికి ఏమిటి సంబంధం?' అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తుల భద్రతకు ప్రయత్నిస్తున్నారా? లేదా వ్యక్తులను లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండనివ్వకుండా చేస్తున్నారా? అని నిలదీశారు. సహజీవనం చేస్తున్న జంటలకు ఏ కారణాలతో భద్రత కల్పించాలనుకుంటున్నారు? అని జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. సామాజిక భద్రత కింద అని న్యాయవాది బదులివ్వగా ఆయనపై మండిపడ్డారు. ఇలాంటి పిల్స్‌పై ఖర్చులు వసూలు చేస్తామని హెచ్చరించారు.

## అమృత్ పాల్ సింగ్ కు పాక్ నుంచి నిధులు

(మొదటిపేజీ తరువాయి)

వీటితో పాటు 7 గన్స్‌నీ రికవర్ చేశామన్నారు.ఇప్పటికే అమృత్ పాల్ సలహాదారు దల్జిత్ సింగ్ కల్సీని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. అతని ఫోన్‌లో పాకిస్థాన్‌కు చెందిన నంబర్లు ఉన్నట్టు వెల్లడించారు. ఆ నంబర్‌లను ట్రేస్ చేస్తున్నారు. ఈ నంబర్‌ల నుంచి దాదాపు రూ.30 కోట్లు ఫండ్స్ అందినట్టు సమాచారం. మొత్తం 10 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వాళ్ల ఫోన్‌లను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. త్వరలోనే అమృత్ పాల్‌ను అరెస్ట్ చేస్తామని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పలు చోట్ల ఆంక్షలు విధించారు. ఇప్పటికే ఇంటర్నెట్ సేవల్ని బంద్ చేశారు. అమృత్ పాల్‌ను పట్టుకునేందుకు చర్యలు మొదలు పెట్టిన వెంటనే అక్కడ ఇంటర్నెట్‌ను ఆపేశారు. అయితే...ఇప్పుడు ఈ ఆంక్షల్ని పొడిగించారు. రేపటి(మార్చి 20) వరకూ ఈ ఆంక్షలు కొనసాగుతాయని పంజాబ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. మొబైల్ ఇంటర్నెట్‌తో పాటు ఎస్ఎంఎస్ సర్వీస్‌లపైనా ఆంక్షలు కొనసాగనున్నాయి. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. అమృత్ పాల్ సింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆయన అనుచరులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

## ప్రజలకు ఇబ్బంది కల్గించే వ్యాపారులపై చర్యలు తప్పవు

**తిరుపతి**



తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నగర పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు కల్గించేలా వ్యాపారాలు చేస్తున్న వారికి, తోపుడు బండ్ల వారికి తగిన చర్యలు తప్పవని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే కార్యక్రమంలో కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు పాల్గొని వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా సచివాలయ సిబ్బందితో కమిషనర్ అనుపమ మాట్లాడుతూ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యలయంలో ప్రతి సోమవారం వచ్చే పిర్యాదులను స్వీకరించి జూమ్ మీటింగ్ ద్వార సంబంధిత సచివాలయ సిబ్బందికి అప్పటికప్పుడే పరిశీలన నిమిత్తం ఇవ్వబడుతుందని, కావున ప్రతి ఒక్క సచివాలయంలో అడ్మిన్ ఆధ్వర్యంలో సెక్రటరీలు అందుబాటులో వుండాలని, ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది యూనిఫామ్ దరించి విధులు నిర్వహించాలని కమిషనర్ అనుపమ అంజలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. తీర్థకట్టవీధిలో తోపుడు బండ్లు అడ్డు కారణంగా వాహనాల పార్కింగ్ చేయడం కష్టంగా వుందని, అదేవిధంగా బ్లిస్ హోటల్ ఎదురుగా తాళ్ళపాక అపార్ట్మెంట్ సమీపంలో రోడ్డుపైన అక్రమముగా షాప్ నిర్మించడంతో వాహనదారులకు ఇబ్బందిగా వుందనే వేరువేరు పిర్యాధులపై స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీనివాసం ఎదురుగా ఓపెన్ డ్రైన్ కోసం త్రవ్వేసి పనులు పూర్తి చేయలదనే పిర్యాదులుపై స్పందిస్తూ మరో పదిరోజుల్లో పనులను చేపడుతామన్నారు. మదురానగర్లో ఓపెన్ డ్రైన్ బ్లాక్ అయినదని, సుందరయ్య నగర్లో మురికినీరు రోడ్డుపైకి వస్తున్నదని, కేశవాయనగుంట వద్ద యూడిఎస్ బ్లాక్ అవుతున్నదని, రాయల్ నగర్లో పెద్ద కాలువని శుభ్రపరచాలనే పిర్యాదులపై స్పందిస్తూ త్వరగా ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని వచ్చిన పిర్యాధీ దారులకు హామి ఇస్తూ వారు సూచించిన పిర్యాదులపై తక్షణమే తమ అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపడుతారని కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, సెక్రటరి రాధిక, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంధ్రరెడ్డి, దేవిక, గోమతి, మహేష్, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తంగా మారిన ఏపీ అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

పలువురు ఎమ్మెల్యేలు కూడా అక్కడికి చేరుకున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది .బాలవీరాంజ నేయస్వామి, సుధాకర్‌బాబు మధ్య ఈ ఘర్షణ జరిగింది. సుధాకర్‌బాబును అడ్డుకున్నారు టీడీపీ ఎమ్మెల్యేలు. సుధాకర్‌బాబుకు మద్దతుగా వైసీపీ ఎమ్మెల్యేలు వెళ్లారు. టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యేల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తడంతో సభ వాయిదా పడింది. అసెంబ్లీ వెల్‌లో టీడీపీ సభ్యుల నిరసనకు దిగారు.టీడీపీ నేతలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి ఆందోళన తెలిపారు. జీవో నెంబరు 1ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు.. టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామిపై దాడికి దిగారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరిపైనా వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేశారని ఆరోపించారు. అయితే, ఈ ఉద్రిక్తత ప్రారంభం అవుతుండగానే, అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేశారు. ఈ గందరగోళ పరిస్థితుల్లో సభను స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు, వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు మాత్రం.. తనపై చంద్రబాబు దాడి చేయించారని, అందుకే డోలా బాలవీరాంజనేయులు తనపై దాడి చేశారని ఆరోపించారు. ఆ క్రమంలో తన చేతికి గాయం కూడా అయిందని అసెంబ్లీ బయట మీడియాకు చూపించారు. దానికి సంబంధించిన విజువల్‌ను స్పీకర్ వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.దీనిపై మీడియా పాయింట్ వద్ద టీడీపీ సభ్యుడు అచ్చెన్నాయుడు వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరించడం దారుణమని ఆరోపించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పిచ్చి పరాకాష్ఠకు చేరిందని వ్యాఖ్యానించారు. టీడీపీ మూడు ఎమ్మెల్సీలు గెలవడంతో వైసీపీకి మతి పోయిందని అన్నారు. 75 ఏళ్ల వ్యక్తి అయిన బుచ్చయ్య చౌదరిపై, డోలా బాలవీరాంజనేయ స్వామిపై దాడి చేయడం దారుణం అని అన్నారు. సీటులో ఉన్న గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై మంత్రి వెల్లంపల్లి దాడి చేశారని ఆరోపించారు. ఘర్షణకు సంబంధించిన మినిట్ టూ మినిట్ వీడియోను స్పీకర్ బయటకు తీయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై తాము దాడి చేసి ఉంటే మమ్మల్ని అసెంబ్లీలోనే ఉరి తీయండని మాట్లాడారు. అసెంబ్లీలో ఆందోళనల నేపథ్యంలో వాయిదా పడి మళ్లీ అసెంబ్లీ ప్రారంభంకాగానే టీడీపీ సభ్యులను స్పీకర్ తమ్మినేని సస్పెండ్ చేశారు. అచ్చెన్నాయుడు, డోలా బాలవీరాంజనేయులు, సహా మొత్తం 11 మంది సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లుగా స్పీకర్ ప్రకటించారు. వారంతా గౌరవప్రదంగా బయటకు వెళ్లిపోవాలని స్పీకర్ ఆదేశించారు.శాసన సభలో టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామిపై దాడిని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు ఒక చీకటి రోజు అని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక ఎమ్మెల్యేపై దాడి జరిగిన ఘటన ఎప్పుడూ జరగలేదని అన్నారు. సీఎం జగన్ ప్రోద్భలంతో, ఒక వ్యూహంతోనే నేడు దళిత ఎమ్మెల్యే స్వామిపై దాడి చేశారని అన్నారు. నేటి సభలో జరిగిన ఘటనతో జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని అన్నారు. చట్టసభలకు మచ్చ తెచ్చిన సీఎంగా జగన్ నిలిచిపోతాడని, స్వయంగా సభలో ఎమ్మెల్యేలపై దాడికి దిగడం ద్వారా వైసీపీ సిద్ధాంతం ఏంటో ప్రజలకు పూర్తిగా అర్థం అయ్యిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో జగన్ కు పిచ్చెక్కి ఇలా వ్యవహరించాడని, ఇది శాసన సభ కాదు.. కౌరవ సభ అని అన్నారు.

### పోడియం దగ్గరకు వస్తే సస్పెండ్ అసెంబ్లీలో కొత్త రూల్

ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం కీలక రూలింగ్ ఇచ్చారు. ఇకపై సభ్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పీకర్ పోడియం దగ్గరకు రాకూడదని స్పష్టం చేశారు. అలా వస్తే ఆటోమేటిక్‌గా సస్పెండ్ అవుతారుని చెప్పారు. ఈ రూల్ విషయంలో ఇకపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సభ గౌరవాన్ని, హోదాలకు తగ్గించే విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు ప్రవర్తించడం కరెక్ట్ కాదన్నారు స్పీకర్. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని.. అందుకే రూలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. అటు టీడీపీ సభ్యుల తీరు అత్యంత హేయంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు స్పీకర్. ఇక అసెంబ్లీ గొడవ వివాదం ప్రివిలేజ్ కమిటీకి చేరనుంది. ప్రివిలేజ్ కమిటీకి పంపాలంటూ మంత్రి ఆదిమూలపు సురేష్ చేసిన విజ్ఞప్తికి స్పీకర్ తమ్మినేని అంగీకరించారు.సోమవారం అసెంబ్లీ ప్రారంభం అయిన కొద్దిసేపటికే సభలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వైసీపీ, టీడీపీ సభ్యుల వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. తనపై టీడీపీ ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి దాడి చేశారని చెప్పారు వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు. తనపై కక్షకట్టి గత రెండేళ్లుగా పలుసార్లు దాడికి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు వర్గాలు ఒకరిపై.. ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీలో జరిగిన ఘర్షణపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య పరస్పరం విమర్శలకు దారితీసింది. టీడీపీ సభ్యులు దాడి చేశారంటూ వైసీపీ ఎమ్మెల్యేలు చెప్పారు. జీవో నెంబర్ వన్ పై నిరసన తెలుపుతున్న తమపైనే దాడి చేశారంటూ టీడీపీ ఎమ్మెల్యేలు కీలక ఆరోపణలు చేశారు.అసెంబ్లీలో టీడీపీ సభ్యుల ప్రవర్తనపై మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ కావాలన్న ఉద్దేశంతోనే సభకు వస్తున్నారని ఆరోపించారు. ఏకంగా స్పీకర్‌పైనే దాడి చేసే పరిస్థితికి టీడీపీ సభ్యులు దిగజారారని విమర్శించారు. స్పీకర్‌కు రక్షణగా వెళ్లిన ఎమ్మెల్యేలు ఎలీజా, సుధాకర్‌బాబుపైనా దాడికి దిగడం దారుణం అంటూ మండిపడ్డారు మంత్రులు.

# వైసీపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోన్న పట్టభద్రులిచ్చిన తీర్పు

**అమరావతి**


పట్టభద్రులిచ్చిన తీర్పు వైసీపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందా..? అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వైసీపీ నేతల గుసగుసలన్నీ ఎమ్మెల్సీ ఎన్నికలపైనే ఎందుకు జరిగాయి? అసెంబ్లీకి వచ్చిన సీఎం జగన్ తన చాంబర్‌లోనే ఎక్కువ సమయం గడపడానికి కారణం ఏమిటి? ఢిల్లీ (పర్యటన ముగించుకుని ఏపీకి వచ్చిన సీఎం జగన్ తన చాంబర్‌లోనే ఎక్కువ సమయం గడిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీ లో కంటే లాబీల్లోనే ఎక్కువ సమయం గడిపారు. తొమ్మిది ఉమ్మడి జిల్లాలు, 108 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు లక్షల మంది ఓటర్లతో జరిగిన ఈ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రావటాన్ని అధికార పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారాన్ని ఉపయోగించుకోవడం.. దొంగ ఓట్లు పోల్ చేయించుకోవడం.. ప్రలోభాలకు గురిచేసినప్పటికీ పట్టభద్రులు తమకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో అర్థంకాని పరిస్థితుల్లోకి వైసీపీ నేతలు జారిపోయారు. అయితే జగన్ మాత్రం ఐప్యాక్ ప్రతినిధులతో సమావేశమైనట్లు తెలుస్తోంది.కార్యనిర్వాహక కాపిటల్ అని చెప్పుతున్న విశాఖలో.. న్యాయ రాజధానిగా చెబుతున్న కర్నూలు లో సైకిల్ జోరుకు ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. తమ కంచుకోటలని విర్రవీగే ఏ నియోజకవర్గాల్లోనూ అధికారపార్టీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకోలేకపోయింది. దీంతో పంక పార్టీలో పూర్తి నైరాశ్యం ఏర్పడింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు.. మంత్రులు ఈ ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. కొంతమంది మంత్రులు తమ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను సచివాలయంలోనే తమ ఛాంబర్‌లోకి పిలిపించుకుని లంచ్ తింటూ మంతనాలు జరిపారు. జగన్ శుక్రవారం ఢిల్లీ వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. శనివారం సీఎం అసెంబ్లీకి వచ్చారు. సభ జరుగుతున్నప్పటికీ ఎక్కువ సమయం ఛాంబర్‌లోనే గడిపారు. స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి, కౌరు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి వద్దకు తీసుకువచ్చి ఫొటోలు తీయించుకున్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఐప్యాక్ ప్రతినిధులతో జగన్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఏపీలో ఏడు నుంచి ఎనిమిది లక్షల మంది ఓటర్లు పాల్గొన్నారు. ఎన్నికల్లో ఓటమిపై జగన్ ఆరా తీశారు. ప్రభుత్వంపై వ్యతిరేకతా.. లేక స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులపై వ్యతిరేకత ఉందా అనే అంశంపై జగన్ అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల ఎంపికలో లోపాలున్నాయని , కొంతమంది ఎమ్మెల్యేలు చెబుతుండగా కొంతమంది మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకతే ఈ పరాజయానికి కారణమని బహిరంగానే చెబుతున్నారు. ఏపీలో గుంటూరు, కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మాత్రమే పట్టభద్రుల ఎన్నికలు జరగలేదు. మిగిలిన పట్టభద్రులంతా ఎన్నికల్లో పాల్గొన్నారన్న విషయాన్ని మర్చిపోవద్దని మాజీ మంత్రి ఒకరు విశ్లేషించారు. అందరు ఓటర్లనూ పట్టభద్రులు ప్రభావితం చేస్తారని అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఏపీలో ఒక రకమైన భయంతో ప్రజలున్నారని, మాట్లాడేందుకు స్వేచ్ఛలేకపోవడం.. ఎడాపెడా పెడుతున్న కేసులు, పెరిగిన చార్జీలు, పన్నులు, ధరల భారం, ఉద్యోగాలు లేకపోవడం, ఉద్యోగుల్లో అసంతృప్తి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవనే ఆందోళన వారిని వెంటాడిందని అధికారపార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.వీటి ప్రభావమే ఎన్నికల్లో కనిపించిందని వివరించారు. ఐప్యాక్ బృందం జగన్‌కు ఏ నివేదిక ఇచ్చినా క్షేత్ర స్థాయిలో ఇవేనని అందరూ అంటున్నారు. రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతినడం, నిర్మాణరంగం కుదేలయిన ప్రభావం కూడా అనేక వర్గాలపై చూపిస్తుందని అంటున్నారు. రాయలసీమ లో తమ పార్టీకి ఎదురైన ఫలితాలు జీర్ణించుకోలేని పరిస్థితుల్లో ఉన్నాయని కూడా ఆ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. కార్యనిర్వాహక రాజధాని అంటే ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదు. న్యాయ రాజధాని అంటే రాయలసీమ వాళ్లు తిరస్కరించారు. అమరావతి పోయిందని కోస్తావాళ్లు కోపంగా ఉన్నారు. ఇక తమకు ఎవరు ఓటు వేస్తారని అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే నవ్వుతూ సమాధానమిచ్చారు. పార్టీలో ఇకపై ఈ అంశాలపై పోస్టుమార్టం జరుగకపోతే భవిష్యత్తులో భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైసీపీ సీనియర్ నేత అన్నారు. కొందమంది నేతలు జగన్ వద్ద వాస్తవాలు దాస్తున్నారని అందుకే ఈ పరిస్థితులు వచ్చాయని ఆ సీనియర్ నేత చెప్పుకొచ్చారు.

ఒకసారి వ్యతిరేకత మొదలైతే.. అది ఆగకపోగా పాతకస్థాయికి చేరుతుందనే విషయాన్ని ఇప్పటికైనా తమ నేతలు తెలుసుకోవాలని వైసీపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# తెలంగాణ గవర్నర్‌కి నోటీసులు ఇవ్వబోము

**న్యూ ఢిల్లీ :**

తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బిల్లులను ఆమోదించడంలేదంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు లో సోమవారం విచారణ జరిగింది. ఇందుకు సంబంధించి గవర్నర్‌కు నోటీసులు జారీ చేసేందుకు సీజేఐ చంద్రచూడ్ ధర్మాసనం తొలుత సిద్ధపడింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందనను కూడా తెలుసుకోవాలని భావించింది. అయితే గవర్నర్‌కు నోటీసులు ఇవ్వవద్దని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా



విజ్ఞప్తి చేయడంతో కోర్ట్ వెనక్కి తగ్గింది.గవర్నర్, కేంద్రానికి నోటీసులు ఇస్తే అది తప్పుడు సంప్రదాయానికి దారి తీస్తుందని తుషార్ మెహతా పేర్కొన్నారు. గవర్నర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, అటువంటి వారికి నోటీసులు ఇవ్వడం సరికాదని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చెబుతున్న బిల్లులలో కొన్నింటిని కొద్ది రోజుల క్రితమే పంపారని... అసలు విషయం ఏమిటో తెలుసుకొని కోర్టుకు నివేదిస్తానని చెబుతాన్నారు. దీంతో సోమవారం కల్లా కోర్టుకు వివరాలు చెప్పాలని సీజేఐ చంద్రచూడ్ సూచించారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు. కాగా ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ వెంటనే ఆమోదించేలా ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ సర్కారు పిటిషన్‌లో కోరిన విషయం తెలిసిందే.

# టీడీపీలో ఎక్కడా లేని ఉత్సాహం

**విజయవాడ :**

మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీకి ఎక్కడా లేనంత ఉత్సాహం తెప్పిస్తోంది. సెమీ ఫైనల్స్ అని స్వయంగా వైఎస్ఆర్‌సీపీ నేతలే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసుకుని ...ఇక ఫైనల్స్‌కు రెడీ అవుతున్నామని అంటున్నారు. నిజానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇంతటి ఫలితాలు వస్తాయని టీడీపీ కూడా అనుకోలేదు. దీనికి కారణం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసే వారు ఎక్కువగా పార్టీ చూడరు. అందుకే పీడీఎఫ్ అభ్యర్థులు తరచూ గెలుస్తుంటారు. అందుకే చివరి క్షణంలో పీడీఎఫ్‌తో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల విషయంలో ఒప్పందం చేసుకున్నారు. అది కలిసి వచ్చింది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ చాలా కాన్ఫిడెంట్ గా మారింది. ప్రజాభిప్రాయం తెలిసిపోయిందని ఇక అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడటమే మిగిలిందని అనుకుంటోంది.అధికార పార్టీగా ఉన్న తర్వాత 2019లో తెలుగుదేశం పార్టీ ఘోర ఓటమిని చవి చూసింది. కేవలం 23 సీట్లకు పరిమితమయింది. తమ ప్రభుత్వంపై అవినీతి మరకలేమీ పడకపోగా.. పన్నులు పెంచలేదని.. అమరావతి, పోలవరాన్ని వేగంగా నిర్మించడంతో పాటు సంక్షేమాన్ని కూడా అద్భుతంగా చేపట్టామని టీడీపీ నేతలు ధీమాగా ఉన్నారు. కానీ ఇలాంటి ఫలితాలు వస్తాయని వారు ఊహించలేదు. దీంతో నిరాశకు గురయ్యారు. అదే సమయంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ అణిచివేతతో నేతలు బయటకు రావడం మానేశారు. 23 మంది ఎమ్మెల్యేలు గెలిచినా వారిలో పట్టు మని పదిహేను మంది మాత్రమే యాక్టివ్ గా ఉన్నారు. మిగతా వారంతా సైలెంట్ అయారు. నలుగురు వైసీపీలో చేరారు. టీడీపీ నేతలపై అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డారు. దాడులు చేశారు. స్వయంగా టీడీపీ ఆఫీసు మీద కూడా దాడి చేశారు. వీటన్నింటితో పాటు దాడులకు గురైన తమనే కేసుల్లో ఇరికిస్తున్నారని టీడీపీ నేతలు పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తూ వ్సతున్నరు. ఈ పరిణామాల మధ్య వచ్చే ఎన్నికలకు టీడీపీ సిద్ధమవుతోంది. అనుకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన అద్భుత విజయాలు వారికి కొండంత బలాన్నిస్తున్నాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా నగదు బదిలీ పథకాలపైనే దృష్టి పెట్టింది. అభివృద్ధి అనే మాటే లేదన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పరుగులు పెట్టిన పోలవరం వంటిప్రాజెక్టులు ఆగిపోయాయి. అమరావతి నిర్మాణం ఆపేసి మూడు రాజధానులు అంటున్నారుకానీ.. ముందుకు సాగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రం చాలా వెనుకబడిపోయిందన్న అభిప్రాయం- ప్రజల్లో ఏర్పడుతోంది. ప్రభుత్వం వేస్తున్న వివిధ రకాల పన్నుల ద్వారా నిత్యావసర రేట్లు కూడా ఏపీలో ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ఉన్నాయని విపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. అదే సమయంలో నాలుగేళ్లలో ఎలాంటిపెట్టుబడులు తీసుకు రాలేదని యువతకు ఉపాధిచూపించలేదని.. ఉద్యోగాల కేలండర్ పే?రతో మోసం చేశారన్న ఆగ్రహం యువతలో ఉందన్న అభిప్రాయం వినిపించింది. అయితే ఈ అసంతృప్తిని ప్రతిపక్ష పార్టీ క్యాష్ చేసుకోగలదా అనుకున్నారు. కానీ ఎమ్మెల్సీ ఫలితాలతో తమకు పూర్తి స్థాయిలో ప్రజల నుంచి భరోసా వచ్చిందని టీడీపీ నేతలంటున్నారు. ఖచ్చితంగా మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికలు గొప్ప ఊరట మాత్రమే కాదు.. ధైర్యంగా బరిలో నిలవడానికి స్ఫూర్తిని కూడా ఇస్తాయి. ఆ ప్రభావం టీడీపీ క్యాడర్ లో కనిపిస్తోంది. గత నాలుగేళ్లలో ఎప్పుడూ చేసుకోనంత వేడుకలు ఇప్పుడు చేసుకుంటున్నరు. అలాగే పట్టభద్రుల ఎన్నికలు అధికార పార్టీకి కూడా కీలకమే. అసలు పట్టభద్రులు ఎందుకు ఇలా స్పందించారో ఆ పార్టీ విశ్లేషణ చేసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకుంటే.. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి హోరాహోరీగా మారవచ్చు.

# యధావిధిగా ఆన్ లైన్ టెస్టులు

**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం లేపిన విషయం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్, ఏఈఈ, డీఏవో, ఏఈ పరీక్షల్ని టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీటిల్లో కొన్ని పరీక్షలను రీషెడ్యూలు చేయాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. వేటిని రీషెడ్యూలు చేయాలి, వేటిని యథాతథంగా కొనసాగించవచ్చన్న విషయమై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మార్చిలో జరగాల్సిన టీపీబీవో, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల పరీక్షలను వాయిదా వేసింది.ఇక ఏప్రిల్, మేలో జరగాల్సిన పరీక్షల తేదీలూ రీషెడ్యూలయ్యే అవకాశమున్నట్లు సమాచారం. రద్దుచేసిన, వాయిదా వేసిన పరీక్షలకు సంబంధించిన కొత్త పరీక్ష తేదీలను ఈ నెలాఖరులోగా ప్రకటించే అవకాశం ఉంది. ఐతే పరీక్షకు రెండు నెలల ముందే ప్రశ్నాపత్రాలు సిద్ధం చేయవల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రానున్న రెండు నెలల్లో జరగాల్సిన పరీక్షలకు ప్రశ్నపత్రాలను సిద్ధం చేయడానికి కొంత సమయం పట్టనుంది. 40 వేల కన్నా ఎక్కువ మంది పోటీపడే పరీక్షలను ఓఎంఆర్‌పద్ధతిలో, అంతకన్నా తక్కువగా సంఖ్యలో హాజరయ్యే పోస్టులకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు పెట్టేందుకు సన్నద్ధమవుతోంది. ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించే పరీక్షలకు ప్రశ్నపత్రం సిద్ధం చేసి, ముద్రించి, పరీక్ష కేంద్రాలకు సరఫరా చేయడానికి కనీసం మూడు నెలల సమయం పడుతుంది .కంప్యూటర్ ఆధారిత పరీక్షలనైతే యథాతథంగా ముందుగా నిర్ణయించిన ప్రకారంగానే అదే తేదీల్లో వేగంగా నిర్వహించి, ఫలితాలు కూడా వెంటనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు కమిషన్ వర్గాలు భావిస్తున్నాయి. గ్రూప్ 1 పరీక్ష రద్దు చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను తొలుత నిర్వహించి.. ముందుగా ప్రకటించిన విధంగా జులై 1న గ్రూప్-4, ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలనే యోచనలో ఉంది. ఇలా వరుసగా మూడింటినీ నిర్వహిస్తే అభ్యర్థులకు ఎవైనా ఇబ్బందులు తలెత్తుతాయా అనే కోణంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఫైనల్‌గా పరీక్షల తేదీలన ఖరారు చేసే అవకాశముంది.

# చైర్మన్ అదుపు తప్పిందా...

**హైదరాబాద్ :**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేపట్టింది తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత అంతా నోటిఫికేషన్లకు తగ్గట్టుగా ప్రిపేర్ అవుతున్నారు. కొన్ని పరీక్షలు కూడా జరిగాయి. మరికొన్ని టైం టేబుల్ ప్రకారం జరగాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో వచ్చిన సమస్య టీఎస్పీఎస్సీ ని కుదిపేస్తోందనే చెప్పాలి. ఐఇ పోస్టులకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ కావడం.. దానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లోని ఉద్యోగులే పాత్రధారులు కావడంతో సమస్య తీవ్రత ఇంకా పెరిగింది. రాజకీయ పక్షాలతోపాటు వివిధ విద్యార్థి, యవజన సంఘాలు భగ్గుమన్నాయి. కమిషన్ ఆఫీసు దగ్గర ధర్నాలు చేపట్టాయి. ప్రస్తుతం కమిషన్ ఆఫీస్ ప్రాంగణంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.ప్రస్తుతం అసిస్టెంట్ ఇంజనీరు పరీక్షను కమిషన్ రద్దు చేసింది. మరో రెండు పరీక్షలు వాయిదా పడ్డాయి. గత ఏడాది అక్టోబరులో జరిగిన గ్రూప్ వన్ పరీక్ష త్రిశంకు స్వర్గంలో ఉంది. ఓ విధంగా ప్రభుత్వం కూడా ఈ అంశంలో డిఫెన్స్‌లో పడిందనే చెప్పాలి. అలాగే టీఎస్పీఎస్సీ విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా మారింది. కమిషన్ ఛైర్మన్ జనార్దన్‌రెడ్డి పనితీరుపైనా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఆఫీసును కంట్రోల్‌లో పెట్టడంలో జనార్దన్‌రెడ్డి విఫలం అయ్యారనే విమర్శలు ఊపందుకుంటున్నాయి. టీఎస్పీఎస్సీ రాజకీయాలకు అతీతంగా ఉండాలని భావించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. కమిషన్ ఛైర్మన్‌గా ఎఎా అధికారిగా పనిచేసిన జనార్దన్‌రెడ్డిని నియమించారు. ఆయనైతే పరీక్షలన్నీ పక్కాగా నిర్వహిస్తారని అనుకున్నారు.జనార్దన్‌రెడ్డి మెతక వైఖరి కొంప ముంచిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. వేదాంత ధోరణి కమిషన్‌లో పనికి కాదని.. స్పీడ్‌గా నిర్ణయాలు తీసుకోవాలని పలువురు సూచించారట. అవన్నీ వర్కవుట్ కాకపోవడంతో ఇప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష చేయాల్సిన దుస్థితి వచ్చింది. ఛైర్మన్‌కు సాంకేతిక నైపుణ్యం లేకపోవడంతో.. ఆఫీసు సిబ్బందిపైనే ఎక్కువ ఆధారపడ్డారనే ఆరోపణలు జనార్దన్‌రెడ్డిపై వస్తున్నాయి. ఆయన కఠినంగా ఉంటే సిబ్బంది తోక జాడించేవారు కాదని.. ఇప్పుడు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని అనుకుంటున్నారు. అసలు కమిషన్‌లోని రహస్య ఛాంబర్లలోకి పెన్‌డ్రైవ్‌లు తెచ్చుకునేంత ధైర్యం సిబ్బందికి ఎలా వచ్చిందని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఛైర్మన్ జనార్దన్‌రెడ్డి చూసీ చూడనట్టు వ్యవహరించడం వల్లే తమకేం కాదనే లెక్కలేని తనానికి సిబ్బంది వచ్చారని టాక్. ఏతా వాతా ఇప్పుడు అన్నీ వేళ్లూ కమిషన్ ఛైర్మన్ జనార్దన్‌రెడ్డి సమర్థతవైపు చూపెడుతున్నాయి. కీలక బాధ్యతల్లో ఉండి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని.. ఐఏఎస్ అధికారిగా ఎలా ఉన్నప్పటికీ.. కమిషన్ ఛైర్మన్‌గా ఆయనలోని చేతకాని తనం బయట పడిందని కమిషన్ వర్గాలు.. రాజకీయ పక్షాలు అభిప్రాయ పడుతున్నాయట.

# బీజేపీ, టీడీపీ కలిసి అడుగులు....

## నడ్డా ట్వీట్ పై కొత్త సందేహాలు

**విజయవాడ :**

అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. బీజేపీ మద్దతుతో ఈ పదవి దక్కింది. ఇది గొప్ప ముందడుగు అన్నట్లుగా జేపీ నడ్డా.. టీడీపీ, బీజేపీ అలయన్స్ గురించి పోస్ట్ చేశారు. ఆ ట్వీట్ వైరల్ అయింది. నిజానికి పోర్టు బ్లెయిర్‌లో ఇప్పుడు ఎన్నికలు జరగలేదు. ఏడాది కిందట జరిగాయి. అప్పట్లో టీడీపీ, బీజేపీ పొత్తు పెట్టుకోలేదు. విడివిడిగా పోటీ చేసాయి. టీడీపీ రెండు స్థానాల్లో గెలిచింది. ఆ రెండు స్థానాలే మేయర్ పీఠాన్ని ఎవరికి దక్కాలో డిసైడ్ చేస్తున్నాయి. అప్పట్లో బీజేపీ నేతలు టీడీపీతో సంప్రదింపులు జరిపి పొత్తు కోసం అంగీకరింపచేశారు. దానిప్రకారం? మొదట బీజేపీ.. తర్వాత టీడీపీ మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలి. మొదట బీజేపీ తీసుకుంది. వారి టర్మ్ అయిపోయిన తర్వాత పద్దతిగా టీడీపీకి అప్పచెప్పింది. పోర్టుబ్లెయిర్‌లో టీడీపీ తపున గెలిచిన ఆ ఇద్దర్నీ చేర్చేసుకుంటే పదవి ఇవ్వాల్సిన అవసరం ఉండదుగా అని బీజేపీ ఆలోచించి కార్యాచరణ ఖరారు చేసుకుని ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో కానీ.. టీడీపీ, బీజేపీ పొత్తు అనే అభిప్రాయాన్ని కల్పించడానికి .. .మాత్రం నడ్డా ఈ విషయాన్ని హైలెట్ చేశారు. అందుకే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ, బీజేపీ మధ్య పొత్తులపై మరోసారి చర్చ ప్రారంభమయింది. టీడీపీ అంటే తెలుగు రాష్ట్రాలు అనే చూస్తారు. అండమాన్‌లో టీడీపీ ఉనికి ఆ పార్టీ నాయకత్వానికే తెలుసు. అలాంటిది నడ్డా ఇప్పుడు? టీడీపీ అండమాన్ లోనూ ఉందని జాతీయ స్థాయిలో చూపించడమే కాదు.. తాము టీడీపీతో పొత్తులో ఉన్నామనట్లగా సందేశం పంపారు. అండమాన్ లో కలిసినప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు కలవకూడదని ఆయన సందేశం ఇచ్చారేమో కానీ ముందు ముందు పరిస్థితులు మరింత మారిపోయే అవకాశం ఉంది. పోర్టు బ్లెయిర్ నుంచి పొత్తు.. ఏపీకి వచ్చినా ఆశ్చర్యం లేదన్న వాదన అందుకే వినిపిస్తోంది. ఇప్పటికే తెలంగాణలో టీడీపీ యాక్టివ్ కావడం వెనుక.. బీజేపతో పొత్తు ఆశలు.. అంచనాలు ఉన్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో బీజేపీకి సహకరిస్తాం.. ఏపీలో తమకు సహకిరంచాలన్న ఒప్పందం కోసమే.. తెలంగాణలో టీడీపీని యాక్టివ్ చేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ నేతల సజ్జల రామకృష్ణారెడ్డి కూడా అనుమానం వ్యక్తం చేశారు. ఏపీలోనూ పొత్తు అంశంపై చర్చలు జరుగుతున్నాయి. 2014 పొత్తు రిపీట్ అవుతుందని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది.కానీ బీజేపీ రాష్ట్ర నేతలు మాత్రం టీడీపీతో పొత్తు ఉండనే ఉండదని ఖండిస్తున్నారు. జనసేన పార్టీ మాత్రం టీడీపీకి దగ్గరవుతున్న సంకేతాలు ఇస్తోంది.పొత్తుల విషయంలో రాష్ట్ర నేతలు ఏం చెప్పినా చివరికి హైకమాండ్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. అయితే పైకి ఏం మాట్లాడినా ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశాభావంతో ఉన్నకొంత మంది నేతలు మాత్రం.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టాలని నేరుగానే చెబుతున్నారు. హైకమాండ్‌కూ సలహాలిస్తున్నారు. అందుకే పోర్టుబ్లెయిర్ లో టీడీపీ, బీజేపీ పొత్తు తెలుగు రాష్ట్రాల దాకా వస్తాయా అన్న చర్చ ప్రారంభమైంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదని అనేక సార్లు నిరూపితమయింది. అందుకే ఈ పొత్తులు కూడా జరగవని చెప్పలేమంటున్నారు.

# టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో నిందితుల విచారణ

**హైదరాబాద్ :**

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో నిందితుల రెండవ రోజు 9 మంది నిందితులను 7 గంటల పాటు సైబర్ క్రైమ్, సిట్టర్యాప్తు బృందం విచారించింది. నిందితుల నుంచి పలు కీలక విషయాలు రాబట్టింది. వాట్సప్ చాట్‌లో సరికొత్త లింకులు బయటపడ్డాయి. ప్రవీణ్ రాజశేఖర్ రేణుకలను విడివిడిగా విచారించారు. ముగ్గురు నిందితుల వాట్సప్ చాట్‌ని రిట్రీవ్ చేశారు. వాట్సప్ చాటింగ్ ముందు పెట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. రాజశేఖర్ చాలామందికి పేపర్లను ఇచ్చినట్లుగా సిట్ గుర్తించింది. ప్రవీణ్, రాజశేఖర్ కలిసి కుట్ర పూరితంగా పేపర్‌ను లీక్ చేసినట్లుగా సిట్ తేల్చింది. రాజశేఖర్, ప్రవీణ్‌ల వ్యక్తిగత కంప్యూటర్ నుంచి డాటాను అధికారులు రిట్రీవ్ చేశారు. రెండు కంప్యూటర్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. గ్రూప్ వన్ పేపర్‌ను చాలామందికి సర్క్యులేట్ చేసినట్లుగా సిట్ అధికారులు గుర్తించారు. ఐదు పేపర్ల సమాచారాన్ని అధికారులు వాట్సాప్‌లో గుర్తించారు.ఈ నెల 5న నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైన ఘటనలో డబ్బు చెల్లింపునకు సంబంధించి నిందితుల మధ్య గొడవ జరిగినట్లు, దాంతో ఈ విషయం పోలీసులకు చేరినట్లు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలానికి చెందిన ఉపాధ్యాయురాలు రేణుకతన తమ్ముడు రాజేశ్‌నాయక్ కోసం టీఎస్‌పీఎస్‌సీలో పనిచేసే ప్రవీణ్ ద్వారా ప్రశ్నపత్రాన్ని సంపాదించినట్లు వెల్లడైన విషయం తెలిసిందే. కాగా, ఈ ప్రశ్నపత్రాన్ని తమ తండాకే చెందిన నీలేశ్, శ్రీను, రాజేందర్‌నాయక్‌లకు ఇచ్చినందుకు రూ.10 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు పరీక్షకు ముందురోజు వీరందరినీ వనపర్తిలోని తన ఇంటికి పిలిపించుకొని అక్కడే వారితో ప్రశ్నలకు జవాబులను ప్రాక్టీస్ చేయించింది. పరీక్ష రోజు తన కారులోనే వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్ష రాయించుకొని వచ్చింది.కాగా, ఒప్పందం ప్రకారం పరీక్షకు ముందు ఒక్కొక్కరు రేణుకకు రూ.2లక్షల చొప్పున చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని పరీక్ష పూర్తయ్యాక ఇస్తామని చెప్పారు. దీంతో పరీక్ష ముగిసిన రోజు రాత్రి వనపర్తిలో రేణుక ఇంట్లో జరిగిన డిన్నర్ తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని అడిగింది. అయితే తమ వద్ద డబ్బులేదని, ఇవ్వలేమని వారు చేతులెత్తేశారు. దీంతో రేణుకకు, వారికి తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఆ సమయంలో ఆవేశానికి లోనైన నీలేశ్‌నాయక్.. డయల్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పేశాడు. పోలీసులు వెంటనే స్పందించి రేణుకతోపాటు ఆమె సోదరుడిని, నీలేశ్‌ని, మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.రేణుక ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చేరిన తర్వాత ఆమె నియామక పత్రంలో పేరులో ఒక అక్షరం పొరపాటుగా పడిందని, దానిని సరిచేసుకోవడానికి ఆమె టీఎస్‌పీఎస్‌సీని సంప్రదించి, పలుమార్లు హైదరాబాద్‌లోకి కార్యాలయానికి వెళ్లారని ఆ క్రమంలోనే ఆమెకు ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడిందని చెబుతున్నారు. వారి పరిచయం కాస్తా స్నేహంగా మారి, ఆపై సాన్నిహిత్యం పెరిగి ఇంతటి అక్రమానికి దారితీసిందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అంతేకాదు.. ప్రవీణ్‌కు ఎక్కువ మంది మహిళలతోనే మొబైల్ కాంటాక్టులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రవీణ్ మొబైల్ ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు.. అతడు మహిళలతో సన్నిహితంగా మాట్లాడిన చాటింగ్‌లు, నగ్న చిత్రాలు ఉన్నట్లు గుర్తించారు.ప్రవీణ్‌తో రెగ్యులర్‌గా కాంటాక్టులు, చాటింగ్‌లు చేస్తున్న వారిలో ఎక్కువగా మహిళలే ఉన్నట్లు సమాచారం. సుమారు 60 మంది మహిళలతో ప్రవీణ్‌కు కాంటాక్టులు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ఆ 60 మందినీ విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా 2017 నుంచి ప్రవీణ్ మొబైల్ ఫోన్ డేటాను పోలీసులు రికవరీ చేయనున్నట్లు తెలిసింది. 2017 నుంచి టీఎస్‌పీఎస్-సీ ఆధ్వర్యంలో ఎన్ని పబ్లిక్ పరీక్షలు జరిగాయి? ఆ సమయంలో ప్రవీణ్ ఏవైనా అక్రమాలకు పాల్పడ్డాడా? అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎమ్మెల్యేపై దాడిని ఖండించిన చంద్రబాబు

**అమరావతి**

శాసన సభలో పార్టీ ఎమ్మెల్యే స్వామిపై దాడిని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు ఒక చీకటి రోజు. రాష్ట్ర చరిత్రలో ఒక ఎమ్మెల్యేపై దాడి జరిగిన ఘటన ఎప్పుడూ జరగలేదు. సిఎం జగన్ ప్రోద్భలంతో, ఒక వ్యూహంతోనే నేడు దళిత ఎమ్మెల్యే స్వామిపై దాడి జరిగింది. నేటి సభలో జరిగిన ఘటనతో జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని మండిపడ్డారు. చట్టసభలకు మచ్చ తెచ్చిన సిఎంగా జగన్ నిలిచిపోతాడు. స్వయంగా సభలో ఎమ్మెల్యేలపై దాడికి దిగడం ద్వారా వైసీపీ సిద్దాంతం ఏంటో ప్రజలకు పూర్తిగా అర్థం అయ్యింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో జగన్ కు పిచ్చెక్కి ఇలా వ్యవహరించాడు. ఇది శాసన సభ కాదు కౌరవ సభ అని అన్నారు.

# ఎమ్మెల్యేపై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం

**కదిరి**

దళితులపై వైసీపీ దమనకాండ అసెంబ్లీలోనూ కొనసాగింది. దళిత మేధావి, అజాతశత్రువు, కొండెపి ఎమ్మెల్యే డాక్టర్ బాల వీరాంజనేయ స్వామిపై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. బ్రిటీష్ కాలంనాటి జీవో1 తెచ్చి ప్రజాస్వామ్యం గొంతు నొక్కొద్దని అసెంబ్లీలో లేవనెత్తడం దళిత ఎమ్మెల్యే చేసిన పాపం అన్నట్టు వైసీపీ ఎమ్మెల్యేలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. దళిత ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామిపై దాడి చేయించడం ద్వారా తన ప్రయాణం నేరాలతోనే.. తన యుద్ధం దళితులపైనే అని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు.

అంతకుముందు అయన టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరిని ఫోన్లో పరామర్శించారుర. దాడి జరిగిన తీరును లోకేష్ కి ఎమ్మెల్యే బుచ్చయ్య వివరించారు. లోకేష్ మాట్లాడుతూ మనం ప్రజాస్వామ్యం లో ఉన్నామా లేక రాక్షస రాజ్యం లో ఉన్నామా అనే అనుమానం వస్తుంది. ప్రతిపక్షాల గొంతు నొక్కే జీఓ 1 రద్దు చేయాలని డిమాండ్ చెయ్యడం కూడా జగన్ పాలన లో నేరమేనా. ఉన్నత విలువలతో సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న మీాపై దాడి చెయ్యడం దుర్మార్గం. ఈ రోజు అసెంబ్లీ లో జరిగిన ఘటనని ప్రజాస్వామ్యవాదులు అందరూ తీవ్రంగా ఖండించాలని అన్నారు.

## భార్యను చంపి భర్త ఆత్మహత్య

**సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం నాదులాపూర్ గ్రామంలో దారుణం జరిగింది.



భార్యను హత్య చేసిని తరువాత భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణ తన భార్య మల్లమ్మను ఇంట్లో గొడ్డలితో నరికి చంపి తాను ఉరి వేసుకున్నాడు మృతి చెందాడు. కారణాలు తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దళిత ఎమ్మెల్యే పై దాడి దుర్మార్గం

### మాజీమంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక పవిత్రమైన అసెంబ్లీలో వైసీపీ అసెంబ్లీ రౌడీలు చెలరేగుతున్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. దళిత శాసన సభ్యుడు డోలా బాలవీరాంజనేయ స్వామి మీద దాడి హేయమైన చర్య అని అన్నారు. దళిత ఓట్లతో గెలిచిన జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా దళిత నాయకుడు డోలా బాల వీరాంజనేయ స్వామి మీద దాడి చేయించటం దుర్మార్గం. జీ వో నంబర్ వన్ మీద ప్రతి పక్ష పార్టీలు చేస్తున్న పోరాటం , అంగన్ వాడిలు చేస్తున్న పోరాటాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు ఈ నీచానికి వైసిపి గుండాలు దిగారు. నాలుగు దశాబ్దాలుగా శాసన సభ్యుడుగా ఉన్న టిడిపి సీనియర్ నేత బుచ్చయ్య చౌదరి మీద అసెంబ్లీ సాక్షిగా వెల్లంపల్లి శ్రీనివాస్ దురుసు ప్రవర్తనను ఖండిస్తున్నాం. చరిత్రలో ఇదొక చీకటి దినం. ప్రజాస్వామ్య వాదులంతా ఎమ్మెల్యే లమీద జరిగిన దాడిని ముక్తకంఠంతో ఖండించాని అన్నారు.

## వందలాది మంది అంగన్వాడి వర్కర్ల అరెస్టు

**విజయవాడ**

విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన వందలాదిమంది అంగన్వాడి టీచర్లు, ఆయాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారంతా వివిధ పోలీస్ స్టేషన్లలో ఆందోళనకు దిఆరు. సీపిఎం నేతలు అంగన్వాడీల అరెస్టులు ఖండించించారు. అంగన్వాడీల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. అంగన్వాడిల అరెస్టులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు ఖండించారు. సిఐటియు పిలుపు మేరకు ఆందోళనకు వస్తున్న మహిళలను దౌర్జన్యంగా అరెస్టులు చేయడం శోచనీయమని అయన అన్నారు. పెత్తందారులపై యుద్ధం అంటూ పేద మహిళ అంగన్వాడీలపై ప్రభుత్వం యుద్ధం చేస్తున్నది. ముందస్తు అనుమతి కోరినా ధర్నాకు అనుమతి ఇవ్వకుండా వచ్చిన వారిని వచ్చినట్టు విచక్షణారహితంగా అరెస్టు చేయడం దుర్మార్గం. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి. అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి. ముఖ్యమంత్రి అంగన్వాడీల కోర్కెలపై ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి. చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని అయన అన్నారు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులమృతి

**నెల్లూరు**



నెల్లూరు జిల్లా తడ సరిహద్దుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పన్నంగాడు జాతీయ రహదారిపై సోమవారం డైవర్షన్ గోడను బైకు ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు స్పాట్లోనే చనిపోయారు. బైకు బోర్డు నంబర్ ద్వారా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వివేకా కేసులో కీలక పరిణామం..

**అమరావతి**



తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్‌వేశారు. వివేక హత్య కేసులో(ఏ-4 దస్తగిరినీఅప్రూవర్?గా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ భాస్కర్ రెడ్డి పిటిషన్ వేశారు. దస్తగిరి స్టేట్మెంట్ ఆధారంగానే అవినాష్ రెడ్డి(భాస్కర్ రెడ్డిలను సిబిఐ విచారించింది. కాగా, దస్తగిరినీ అప్రూవర్?గా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ లో..“దస్తగిరి స్టేట్మెంట్ ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. సీబీఐ చెప్పినట్లుగా దస్తగిరి స్టేట్మెంట్ ఇస్తున్నారు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. కీలక పాత్ర పోషించిన దస్తగిరి కి బెయిల్ ఇవ్వటం సరికాదు. వివేక హత్య కేసులో కీలకంగా ఉన్న ఆయుధాన్ని కొనుగోలు చేసింది దస్తగిరినే..దస్తగిరి బెయిల్ సమయంలోను సీబీఐ సహకరించింది..దస్తగిరిపై ఉన్న ఆధారాలను కింది కోర్ట్ పట్టించుకోలేదు. దస్తగిరికి ఇచ్చిన బెయిల్?ను రద్దు చేయాలని పిటిషన్”లో భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

# కేటీఆర్ కనుసన్నల్లోనే లీకేజ్

**హైదరాబాద్ :**

టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీకి మంత్రి కేటీఆర్ బాధ్యుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. గ్రూప్-1 పేపర్ లీకేజీ వ్యవహారంలో నమ్మలేని నిజాలు వెలుగుచూశాయన్నారు. బీఆర్ఎస్ జడ్పీటీసీ, సర్పంచ్, సింగిల్ విండో ఛైర్మన్ పిల్లలు, బంధువులు గ్రూప్ 1 పరీక్షలో క్వాలిఫై అయ్యారన్నారు. ఒకే మండలం నుంచి 50 మందికిపైగా క్వాలిఫై అయ్యారని, ఒక చిన్న గ్రామంలో 6గురు క్వాలిఫై అయ్యారని ఆరోపించారు. ఈ లీకేజీకి కేసీఆర్ కొడుకే బాధ్యుడని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ నియమించిన సిట్ విచారణ ఎలా చేయగలదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. మంత్రివర్గం నుంచి సీఎం కేసీఆర్ కొడుకును బర్త్ రఫ్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో బీఆర్ఎస్ నేతల పిల్లలు, బంధువులే అధిక సంఖ్యలో క్వాలిఫై అయ్యారని ఆరోపించారు. తెలంగాణ నిరుద్యోగ యువత నోట్లో మట్టికొట్టి తన ఇంటికే ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్న సీఎం కేసీఆర్



ఇప్పుడు బీఆర్ఎస్ నేతల పుత్రరత్నాలకు, బంధువులకు ప్రభుత్వ కొలువులు ఇప్పించే కుట్ర చేశారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో అక్రమాలకు పాల్పడి 30 లక్షల మంది యువతీ, యువకుల జీవితాలను ఆగం చేశారన్నారు. గ్రూప్-1 పరీక్షకు సంబంధించి ఒక్కొక్క విషయం వెలుగు చూస్తున్న కొద్దీ యాఖూఅ స్కామ్ అనుకున్న దానికన్నా చాలా పెద్దదని అర్థమవుతోందన్నారు. బీఆర్ఎస్ నేతల పిల్లలు, బంధువులు, వారివద్ద పని చేసే వాళ్లను గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షల్లో క్వాలిఫై చేసినట్టు తెలుస్తోందన్నారు. జగిత్యాల జిల్లాలోని ఓ మండలంలో 50 మందికిపైగా మెయిన్స్ కు అర్హత సాధించారన్నారు. ఒక చిన్న గ్రామం నుంచే 6 గురు క్వాలిఫై అయ్యారని, వీళ్లంతా ప్రతిభావంతులు అనుకుంటే పొరబాటే అన్నారు. బీఆర్ఎస్ నేతల కొడుకులు, బంధువులు, వాళ్ల వద్ద పనిచేసే వాళ్లు కావడం వీళ్లకున్న ఎక్స్ ట్రా క్వాలిఫికేషన్ అని బండి సంజయ్ అన్నారు.”నలుగురు బీఆర్ఎస్ సర్పంచుల కొడుకులు, సింగిల్ విండో ఛైర్మన్ కొడుకుతో పాటు ఒక జడ్పీటీసీ బాడీగార్డ్ కొడుకు క్వాలిఫై అయ్యారు. ఒక సర్పంచ్ కుమారుడికి అర్హతలు లేకున్నా దొడ్డిదారిన క్వాలిఫై చేశారు. ఇదంతా కేసీఆర్ కొడుకు కనుసన్నల్లోనే జరిగింది. ఇందుకు ఒక్కొక్కరి దగ్గర నుంచి 3 నుంచి 5 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. నిరుద్యోగ యువతకు అన్యాయం చేసి అనర్హులకు ఉద్యోగాలిప్పిస్తున్న కేసీఆర్ కొడుకును తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి. సీఎం కొడుకు ప్రమేయం ఉన్న నేపథ్యంలో ఆయన నియమించిన సిట్ తో నిష్పక్షపాత విచారణ ఎలా సాధ్యం? నయీం డైరీ, టాలీవుడ్ డ్రగ్స్ కేసు, మియాపూర్ ల్యాండ్ కేసు, ఇంటర్మీడియట్ స్టూడెంట్స్ సూసైడ్ కేసు తరహాలోనే పేపర్ లీకేజీ కేసును సైతం సిట్ కు అప్పగించి పక్కదారి పట్టించే కుట్ర జరుగుతోంది. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు అభ్యంతరం ఎందుకు?” అని బండి సంజయ్ ప్రశ్నించారు.

# 22 మంది ఎమ్మెల్యేలకు కష్టమే...

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఎన్నికలు ఏడాది చివరిలో జరగనున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ కల్లా అభ్యర్థుల్ని ప్రకటించాలని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ భావిస్తున్నారు. ఈ మేరకు ఆయన వివిధమార్గాల ద్వారా సర్వేలు తెప్పించుకుని కసరత్తు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో ఎమ్మెల్యేల గురించి సమాచారం సేకరించారు. ఇటీవల కార్యవర్గ సమావేశంలో కొంత మంది ఎమ్మెల్యేలు చేస్తున్న దందాపై నేరుగానే హెచ్చరికలు జారీ చేశారు. ఇలా ప్రతీ ఒక్కరి పనితీరుతో పాటు నియోజకవర్గంలో వారి కుటుంబసభ్యుల జోక్యం వారి వ్యాపారాలు, ప్రజల పట్ల వారు వ్యవహరిస్తున్న తీరు, లబ్ధిదారుల ఎంపికలో వారి పాత్ర మొత్తంసేకరించి అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్గాల్లో విస్తృతంగా జరుగుతున్న ప్రచారం మేరకు అధికార పార్టీ చెందిన నలుగురు మంత్రు లతో పాటు 22 మంది ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేసీఆర్ అంచనాకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఎనిమిది మంది ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని హైదరాబాద్ కేంద్రంగా వారు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ వారం పది రోజుల కొకసారి నియోజక వర్గానికి వెళ్తున్నట్లుగా తేలింది. అలాగే వేములవాడ ఎమ్మెల్యే ఎక్కువగా జర్మనీలోనే ఉంటారు. వెనుకపడినట్లుగా భావిస్తున్న ఎమ్మెల్యేలను పిలిచి చివరిసారిగా హెచ్చరి కలు జారీ చేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. తర్వాత కూడా పద్దతి మార్చుకోకపోతే.. కొత్త వారికి టిక్కెట్ ఖరారు చేస్తారు. ఈ దఫా జరిగే అసెంబ్లీ ఎన్నికలు కీలకం కావడంతో టికెట్ల కేటాయింపులో గతంలో మాదిరిగా కాకుండా ఈ దఫా అత్యంత కఠినాతి కఠినంగా వ్యవహరించాలన్న నిర్ణయానికి భారాస అధినేత కేసీఆర్ వచ్చినట్టు- సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ మళ్ళీ పోటీ చేసే అవకాశం ఇస్తామంటే ప్రజల్లో వ్యతిరేకత పెంచుకోవడం కాదని అంటున్నారు. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యే అయినా మంత్రి అయినా సీఎం కేసీఆర్ వారిని ఉపేక్షిస్తూ వచ్చారని, ఇదివరకు జరిగిన పలు ఎన్నికల్లో ఇలా ఎన్నో జరిగాయని గుర్తు చేస్తున్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజలతో సాన్నిహితంగా ఉండాలని ప్రతి సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్నా కొంతమంది ఎమ్మెల్యేలు తమ వైఖరిని మార్చుకోవడం లేదని, దీంతో పార్టీ ఆయా నియోజకవర్గాల్లో పలచన అవుతోందని భావిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల బలాబలాలు, వారి వ్యూహం ఎత్తులకు పై ఎత్తులు వేయడంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న సమాచారం కేసీఆర్‌కు అందుతోందని చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు తీరుతెన్నులు, లబ్ధిదారుల అభిప్రాయాలు కూడా సేకరించి…తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. మంత్రుల పనితీరుపై కేసీఆర్ ఒక అభిప్రాయానికి వచ్చారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 26న మహారాష్ట్రలో నిర్వహి స్తున్న బహిరంగ సభ తర్వాత వెనుకబడిన మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రగతిభవన్‌కు పిలిపించి తుది హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందంటున్నారు. ఎలా చూసినా ఇరవై మంది ఎమ్మెల్యేలకు ఈ సారి టిక్కెట్లు ఉండకపోవచ్చంటున్నారు.

## టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో నమ్మలేని నిజాలు: బండి

**హైదరాబాద్ :**

టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో నమ్మలేని నిజాలున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ఆరోపించారు. గ్రూప్-1లో బీఆర్ఎస్నేతల పిల్లలు, బంధువులు క్వాలిఫై అయ్యారని చెప్పారు. ఒకే మండలం నుంచి 50 మందికి పైగా క్వాలిఫై అయ్యారని, ఒక చిన్న గ్రామంలో ఆరుగురు క్వాలిఫై అయ్యారని, దీనికి మంత్రి కేటీఆరేబాధ్యుడని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. కేసీఆర్నియమించిన సిట్ విచారణ ఎలా చేయగలదని ఆయన ప్రశ్నించారు. నయీం డైరీ, సినీ తారల డ్రగ్స్ తరహాలోనే పేపర్ లీకేజీ కేసును సిట్‌కు అప్పగించి పక్కదారి పట్టించే కుట్ర జరుగుతోందని బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. సిట్టింగ్ జడ్జి విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాల్సిందేనని, త్వరలో కేటీఆర్ నిర్వాకాన్ని ప్రజల ముందు పెడతామని బండి సంజయ్ తెలిపారు.మరోవైపు ఈ కేసులో రెండవ రోజు పేపర్ లీక్ నిందితుల విచారణ ముగిసింది. 9 మంది నిందితులను 7 గంటల పాటు సైబర్ క్రైమ్ ఐ సిట్ దర్యాప్తు బృందం విచారించింది. నిందితుల నుండి పలు కీలక విషయాలు రాబట్టింది. వాట్సప్ చాట్‌లో సరికొత్త లింకులు బయటపడ్డాయి. రాజశేఖర్, ప్రవీణ్, రేణుకలను విడివిడిగా విచారించారు. ముగ్గురు నిందితుల వాట్సప్ చాట్‌ని రిట్రీవ్ చేశారు. వాట్సప్ చాటింగ్ ముందు పెట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. రాజశేఖర్ చాలామందికి పేపర్లను ఇచ్చినట్లుగా సిట్ గుర్తించింది. ప్రవీణ్, రాజశేఖర్ కలిసి కుట్ర పూరితంగా పేపర్‌ను లీక్ చేసినట్లుగా సిట్ తేల్చింది. రాజశేఖర్, ప్రవీణ్‌ల వ్యక్తిగత కంప్యూటర్ నుంచి డాటాను అధికారులు రిట్రీవ్ చేశారు. రెండు కంప్యూటర్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.గ్రూప్ వన్ పేపర్‌ను చాలామందికి సర్క్యులేట్ చేసినట్లుగా సిట్ అధికారులు గుర్తించారు. ఐదు పేపర్ల సమాచారాన్ని అధికారులు వాట్సాప్‌లో గుర్తించారు.

## బీసీల కుల గణన చట్టసభల్లో రిజర్వేషన్లపై పై ఏప్రిల్ 3న చలో ఢిల్లీ

**హైదరాబాద్**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్ గార్ల ఆధ్వర్యంలో ఏప్రిల్ మూడో తారీఖున ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం జాతీయస్థాయిలో బీసీల కులగణన కోసం బీసీ ఉద్యోగుల ప్రమోషన్ లో రిజర్వేషన్ కోసం కేంద్రంలో ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖ కోసం ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద పెద్ద ఎత్తున జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పెద్ద ఎత్తున బిసి సంఘాల ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జ్ కర్రీ వేణుమాధవ్ తెలియజేశారు . బీసీల మరియు కుల సంఘాల చట్టసభలో రిజర్వేషన్లు బీసీ నాయకుల పాత్ర పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జి కర్రి వేణు మాధవ్ పాల్గొని బీసీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు దేశంలో ఎన్నికల సంవత్సరం కాకపోయినా ఎన్నికల మూడు ఈ సంవత్సరమే వచ్చేసిందని ప్రతి పార్టీ కూడా బీసీల అవసరాన్ని గుర్తించే పరిస్థితికి బీసీ ఉద్యమం ఎదిగిందని ఈ సందర్భంగా నాయకులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కోలా జనార్దన్ రావు గారు హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపేష్ సాగర్ గారు శుభ ప్రదు పాల్గొన్నారు

## ఈడీ విచారణకు హజరయిన కవిత

**న్యూఢిల్లీ**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఈడీ సోమవారం నాడు విచారణకు హాజరయ్యారు. ఉదయం ఢిల్లీలోని సీఎం కేసీఆర్ నివాసం నుంచి కవిత తన భర్త అనిల్, అడ్వకేట్లు, పార్టీ నేతలతో కలిసి ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. కారు ఎక్కేముందు, ఈడీ కార్యాలయం దగ్గర కుడా ఆమె బిఆర్ఎస్ నేతలకు, కార్యకర్తలకు అభివాదం చేసారు. తనేవాత కవిత ఈడీ కార్యాలయం లోపలికి వెళ్లారు. ఈడీ అధికారులు ఈ కేసులో విచారణ ఎదుర్కొటున్న రామచంద్ర పిళ్లైతో కలసి విచారించినట్లు సమాచారం.
ఆదివారం రాత్రినుంచి ఆమె న్యాయనిపుణులతో చర్చలు జరిపినట్లు సమాచారం.

## ఇది చంద్రబాబు చేయిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడి -మంత్రి రోజా

**అమరావతి**

సోమవారం నాడు శాసనసభలో జరిగిన ఘటనపై మంత్రి రోజా స్పందించారు. ఇది చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడి అని ఆమె ఆరోపించారు. గతంలో కూడా బీసీల తోకలు కత్తిరించాలని బీసీలు జడ్జీలుగా పనికిరారని మాట్లాడిన చంద్రబాబుకు బీసీలంటే ఎప్పుడు చులకనే... స్పీకర్ పోడియం వద్దకు వచ్చి బీసీ సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ పై పేపర్లు చింపి విసురుతూ ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలపై దాడి చేసిన టీడీపీ ఎమ్మెల్యేలను చట్ట సభల నుండి సస్పెండ్ చెయ్యాలని అన్నారు.

## టిఎస్పిఎస్ఎసి పేపర్ లీకేజ్ కేసు మంగళవారానికి వాయిదా

**హైదరాబాద్**

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నా పత్రాల లీక్ కేసును హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. సోమవారం నాడు పిటిషన్ విచారణకు రాగానే పిటిషనర్ బల్మూరి వెంకట్ పేపర్ లీకేజ్ కేసు పిటిషన్ ను రేపటికి వాయిదా వేయాలని కోరారు. సుప్రీం కోర్టు న్యాయవాది కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు వివేక్ ధన్కా వాదనలు వినిపిస్తారని న్యాయవాది కరుణాకర్, కోర్టుకు తెలిపారు. నిరుద్యోగులు ఇదే కేసులో హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేసారు. దాంతో కోర్టు పిటిషన్ విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## స్పందన వినతులకు అర్థవంత పరిష్కారం చూపాలి

**తిరుపతి,**

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమనీలో జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ డి. కె బాలాజీ, డి ఆర్ ఓ శ్రీనివాసరావు, ఎస్ డి సి లు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి స్పందన ఆన్ లైన్ నమోదుతో రసీదులు అందించారు. రెవెన్యూ శాఖకు-108, పోలీస్ శాఖ కు -04, మునిసిపల్ శాఖ - 04, పంచాయతీ రాజ్ కు - 01, డి ఆర్ డి ఎ కు -01 , పి ఓ ఎస్ ఎస్ ఎ ? 01 , వైద్య ఆరోగ్య శాఖ -02 , లాండ్ అండ్ సర్వే ? 01, సర్వ శిక్ష అభయాన్ -01, స్కిల్ డెవలప్ మెంట్ -01, ఎంప్లాయిమెంట్ -01 లు కలిపి 125 మొత్తం వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## రైతులను తక్షణమే ఆదుకోవాలి

**నంద్యాల**

గత బుధవారం రాత్రి ఈదురుగాలులు వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి ఎం శంకర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బుధవారం కురిసిన అకాల వర్షం వల్ల అరటి మిరప ఆముదము మొక్కజొన్న మరియు ఉద్యానవన పంటలు వడగండ్ల వర్షానికి పొలాల్లో కల్లాలలో ఉన్న మిరప పంట పూర్తిగా తడిసిందని చెట్లకు ఉన్న కాయలు నేలరాలాయని కోత దశకు వచ్చిన కోట్లాది రూపాయల విలువచేసే అరటి పంట నేలమట్టమైందని అలాగే మిరప నేలరాలి పోయిందని దీంతో రైతాంగం పెట్టిన పెట్టుబడి వర్షార్పణమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం పండించిన పంట అకాల వర్షానికి నష్టపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు నేలపాలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు జిల్లావ్యాప్తంగా దాదాపు 5 వేల హెక్టార్లలో పంట నష్టం అలాగే దాదాపు 700 గొర్రెలు మృతి చెందాయని అధికారుల ప్రాథమిక అంచనా అని కావున తక్షణమే అధికారులు స్పందించి సమగ్ర పంటల నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# గ్రాడ్యుయేట్ ఫలితాలతో... జనసేనలో కొత్త ఆశలు

**గుంటూరు :**

ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల ప్రభావం భవిష్యత్ రాజకీయాలపై స్పష్టంగా కనపడే అవకాశముంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకంగా మూడు స్థానాలు గెలిచిన టీడీపీ హుషారుగా ఉంది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, ఆ వ్యతిరేకతను చీలిపోకుండా చేయగలిగితే ప్రతిపక్షాలకు స్కోప్ ఉందనే నమ్మకం జనసేనకు వచ్చింది. పొత్తులపై అటు ఇటు ఆలోచిస్తున్న ఈ రెండు పార్టీలు ఇప్పుడు హుషారుగా జతకలిసే సమయం వచ్చింది.ఏపీలో ఎన్నికలకు ఇంకా ఏడాది మాత్రమే టైమ్ ఉన్నా.. పొత్తులు ఇంకా ఖరారు కాలేదు. వైసీపీ సింగిల్ గా పోటీ చేస్తామని ఇదివరకే చాలాసార్లు చెప్పింది. దమ్ముంటే ఒంటరిగా రండి 175 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పండి అంటూ సవాళ్లు విసురుతున్నారు వైసీపీ నేతలు. వారు రెచ్చగొట్టినా టీడీపీ, జనసేన, బీజేపీ మాత్రం విడివిడిగా ఎన్నిసీట్లలో పోటీ చేస్తామనే విషయాన్ని చెప్పలేకపోతున్నాయి. బీజేపీ ఇంకా జనసేనతో పొత్తులోనే ఉన్నామనుకుంటోంది. జనసేనతో కలిపి అన్ని స్థానాల్ల పోటీ చేస్తాం, విజయం సాధిస్తాం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటున్నారు ఏపీ బీజేపీ నేతలు. వారి సత్తా ఏంటో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తేలిపోయింది. ఉత్తరాంధ్రలో సీనియర్ నేత మాధవ్ చిత్తు చిత్తుగా ఓడిపోయారు. సో ఇక మిగిలింది టీడీపీ, జనసేన. జనసేనకు ఇప్పటికే బీజేపీ సత్తా ఏంటో ఓ క్లారిటీ వచ్చింది. గతంలో ప్రతి ఉప ఎన్నిక విషయంలో కూడా బీజేపీ తమ పంతమే నెగ్గించుకుంది కానీ పవన్ మాట వినలేదు. హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ చేద్దామన్నా కూడా వద్దని వారించారు బీజేపీ నేతలు. ఇటీవల ఆవిర్భావ సభలో కూడా ఇవే విషయాలు చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు పవన్. సో.. ఆయనకు టీడీపీతో కలిసేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు మంచి అవకాశమనే చెప్పాలి.జనసేనానికి టీడీపీతో కలవాలని ఉన్నా.. జనసైనికులకు మాత్రం ఎక్కడో కాస్త సంశయం ఉంది. టీడీపీతో కలసి వెళ్తే లాభమా, టీడీపీతో ఉంటే పోటీచేసే సీట్ల విషయంలో కోతపడుతుందేమోననే అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ పవన్ మాత్రం మొదటినుంచీ ఒకేమాట చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తే విజయం మనదేనంటున్నారు. జనసేనకు నష్టం లేకుండా పొత్తుల గురించి ఆలోచిస్తామంటున్నారు. ఇప్పుడు టీడీపీ విజయం జనసేనలో కూడా హుషారుని తెప్పించింది.ముసుగు తీసేయండి, కలసి పోటీ చేస్తామని ధైర్యంగా చెప్పండి అంటూ వైసీపీ నేతలు ఇటీవల టీడీపీ, జనసేనకు సవాళ్లు విసిరారు. ఇప్పుడు జనసేనకు టైమ్ వచ్చింది. కలిసే వస్తామని జనసేనాని ధైర్యంగా చెబుతారా, మరికొన్నిరోజులు వేచి చూస్తారా అనేది మాత్రం తేలాల్సి ఉంది.ఒకవేళ పొత్తులు ఖరారు అయినా ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనేది తేలాల్సి ఉంది. మరోవైపు వైసీపీనుంచి ఇప్పటికే ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేలు టీడీపీవైపు చూస్తున్నారు. వారిద్దరితో ఆ వ్యవహారం ఆగిపోతుందా, మరికొంతమంది అసంతృప్తులు, చివరి నిమిషంలో టికెట్ రానివాళ్లు టీడీపీవైపు వచ్చే అవకాశముందా అనేది కూడా తేలాల్సి ఉంది. ఈ లెక్కలన్నీ వేసుకుని టీడీపీ, జనసేన టికెట్ల కేటాయింపులు చూసుకోవాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు పార్టీల కూటమిపై ఆయన సానుకూలంగా స్పందించారు. 2024 నాటికి ఏపీలో కూటములు ఎలా ఉంటాయో తెలియదు కానీ, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ఆ వైపుగా అడుగులు వేయిస్తాయనేది మాత్రం ఖాయమనే చెప్పాలి.

# జూన్ 2 భూముల క్రమబద్ధీకరణ కటాఫ్

**హైదరాబాద్ :**

తెలంగాణలో దీర్ఘకాలంగా ప్రభుత్వ భూముల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలు ఆ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. వారికి హక్కులు కల్పించేందుకు మరోసారి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి కూడా మరోసారి క్రమబద్ధీకరణ వెసులుబాటు కల్పించింది.పేదల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు జీవో 58, జీవో 59 కింద భూముల క్రమబద్ధీకరణ, హక్కుల బదలాయింపు కోసం మరోసారి దరఖాస్తు చేసుకునే అకాశం కల్పించింది ప్రభుత్వం. కటాఫ్ తేదీని 2020 జూన్ 2వ తేదీ వరకు పొడగించింది. ఈ క్రమంలోనే రెవెన్యూ శాఖ శుక్రవారం రోజు జీవో నెంబర్ 28, 29 జారీ చేసింది. పట్టణాల్లోని భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు 30 రోజులు అవకాశం ఇవ్వగా.. సింగరేణి పరిధిలో దరఖాస్తులకు మూడు నెలలు అవకాశం ఇచ్చింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో జీవో 58, 59 కింద పట్టణ పేదలకు మరోసారి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో కటాఫ్ తేదీని పొడగించింది. అయితే వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని భావించినప్పటికీ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. శుక్రవారం కోడ్ ఎత్తివేయడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపెల్లి, జగిత్యాల జిల్లాల పరిధిలో సింగరేణి క్యాలరీస్ కంపెనీ లిమిటెడ్ భూములు నివాసం ఉంటున్నవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడేనాటికి అంటే 2014 జూన్ 2వ తేదీ నాటికి పట్టణాల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి శాశ్వత హక్కులు కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు 2014 డిసెంబర్ 30వ తేదీన జీవో 58, 59ను విడుదల చేశారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించారు. పలు కారణాల వల్ల కొందరు దరఖాస్తు చేసుకోలేకపోయారని గుర్తించిన సర్కారు... గత ఏడాది ఫిబ్రవరిలో మరోసారి దరఖాస్తుకు అవకాశం కల్పించింది. ఈ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. సింగరేణి పరిధిలోనూ జీవో 58, 59 కింద 2014లో ఒకసారి, 2019లో మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించింది. అధికారులు ఆ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించారు. ఇలా ఇప్పటి వరకు జీవో 58 కింది.. లక్షా 45 వేల 668 మంది పట్టాలు పొందారు. జీవో 59 కింద 42 వేల మందికి వారి ఇండ్లపై హక్కులు సంక్రమించాయి. తాజాగా పేదలకు మరోసారి దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కటాఫ్ తేదీని ఆరేళ్లు పొడగించింది. 2020 జూన్ 2వ తేదీకి మార్చింది. ఈ నిర్ణయంతో లక్షల మందికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్గనుంది. గతంలో ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు పెద్ద ఎత్తున అవినీతి జరిగేది. స్థానిక నాయకులు పెద్ద మొత్తంలో డబ్బులు అడిగేవారు. కానీ తెలంగాణ సర్కారు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకోవడం వల్ల చాలా వరకు అవినీతి తగ్గింది. క్రమబద్ధీకరణకు కొత్త కటాఫ్ తేదీ 2020 జూన్ 2వ తేదీ. అలాగే పట్టణాల్లో దరఖాస్తుల గడువు తేదీ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు. సింగరేణి పరిధిలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు. 125 చదరపు గజాల్లోపు స్థలాలను ఆక్రమించుకొని ఇండ్లు కట్టుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరణ. 126-250 చదరపు గజాల వరకు ఆక్రమించిన వారు భూమి మార్కెట్ ధరలో 50 శాతం ఫీజు చెల్లించాలి. 251-500 చదరపు గజాల వరకు విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకున్న వారు మార్కెట్ ధరలో 75 శాతం ఫీజు చెల్లించి క్రమబబద్ధీకరించుకోవచ్చు. 500 నుంచి వెయ్యి గజాల వరకు ఉంటే ప్రభుత్వ ధరను 100 శాతం చెల్లించాలి. నివాసేతర భూములకు ధర 100 శాతం చెల్లించాలి. మీసేవ కేంద్రాల్లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ స్థలంలో కటాఫ్ తేదీ కన్నా ముందు నుంచే నివాసం ఉంటున్నట్లు ధ్రువపత్రాలను సమర్పించాలి. ఆర్డీఓ ఛైర్మన్ గా, తహసీల్దార్ సభ్యులుగా ఉండే కమిటీ దరఖాస్తులను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుంటుంది.

# ముందు తమ్ముడు... తర్వాత అన్న...

## కోటంరెడ్డి బ్రదర్స్ ప్లాన్

**నెల్లూరు :**

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీకి మరో అడుగు దగ్గరవుతున్నారు. ఈనెల 24న రూరల్ ఎమ్మెల్యే సోదరుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి టీడీపీలో చేరబోతున్నారని తెలుస్తోంది. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నెల్లూరు నుంచి కార్లతో ర్యాలీగా విజయవాడ వెళ్లి పార్టీ ఆఫీస్ లో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో గిరిధర్ రెడ్డి టీడీపీలో చేరతారని అంటున్నారు. దీనిపై అటు టీడీపీ నుంచి కానీ, ఇటు కోటంరెడ్డి ఆఫీస్ నుంచి కానీ అధికారిక ప్రకటన విడుదల కాలేదు. అయితే మంతనాలు మాత్రం జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున చేరికల ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు రూరల్ సత్తా ఇది అని చూపించేందుకు కోటంరెడ్డి బ్రదర్స్ పావులు కదుపుతున్నారు.ముందు తమ్ముడు గిరిధర్ రెడ్డి టీడీపీలో చేరతారు, ఆ తర్వాత అన్న శ్రీధర్ రెడ్డి పార్టీకి దగ్గరవుతారు. ఇదీ ప్రస్తుతం ఉన్న ప్రణాళిక. ఇటీవల కోటంరెడ్డి అసెంబ్లీలో కూడా టీడీపీ ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉన్నారు. టీడీపీ కండువా కప్పుకోకపోయినా ఆ పార్టీ నేతలతో ఆయన టచ్ లో ఉన్నారని, అందుకే నిరసనలకు దిగారని వైసీపీ ఆరోపించింది. దానికి కొనసాగింపుగా ఇప్పుడు నెల్లూరు రూరల్ రాజకీయాలు మారిపోబోతున్నాయి. చేరితే ఇద్దరూ ఒకేసారి చేరొచ్చు కదా, ముందు తమ్ముడు, ఆ తర్వాత అన్న.. ఇదెక్కడి లాజిక్ అనుకుంటున్నారు కొంతమంది. అయితే ఇప్పటికిప్పుడు టీడీపీ కండువా కప్పుకోవాల్సిన





అవసరం లేదని, స్వతంత్రంగానే ఉంటూ నియోజకవర్గ సమస్యలపై పోరాటం చేయాలని చంద్రబాబు, కోటంరెడ్డికి సూచించారని తెలుస్తోంది. మరోవైపు కోటంరెడ్డే స్వయంగా తన రూరల్ సమస్యలపై పోరాటం చేసి, వాటిని సాధించుకున్న తర్వాతే టీడీపీ కండువా కప్పుకుంటానని చంద్రబాబుకి చెప్పినట్టు కూడా వార్తలు వస్తున్నాయి. వీటిలో ఏది నిజమో తేలాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

మరోవైపు కోటంరెడ్డి రాకను టీడీపీలో కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటి వరకు నెల్లూరు రూరల్ ఇన్ చార్జ్ గా ఉన్న అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డిని తీవ్రంగా విమర్శిస్తున్నారు. టీడీపీ నేతలపై జరిగిన దాడి కేసు కూడా కోటంరెడ్డి, ఆయన అనుచరులపై ఉంది. ఆ దాడిలో బాధితులు కూడా కోటంరెడ్డి మాకొద్దు అంటున్నారు. ఈ దశలో ఇప్పటికిప్పుడు ఆయన టీడీపీలోకి రావడంపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. టీడీపీ అధిష్టానం కూడా ముందు స్థానిక నేతలకు సర్ది చెప్పుకోవాల్సి ఉంది. అందుకే ముందుగా కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని, ఆ తర్వాత అంతా సర్దుకున్నాక శ్రీధర్ రెడ్డి పార్టీలోకి వస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది.కోటంరెడ్డి రాకతో నెల్లూరు రూరల్ లో టీడీపీకి కచ్చితంగా బలం పెరుగుతుంది. రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి సొంత ఇమేజ్ తో చాలా పనులు చేశారు, ఆయనకంటూ ప్రత్యేక వర్గం ఉంది. ఆయన ఎటువైపు ఉంటే అటువైపు అనేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికీ ఆయన వెంట ఉన్నారు. కొంతమంది కాంట్రాక్ట్ బిల్లులు రాలేదని, తాత్కాలికంగా వైసీపీ వైపు ఉన్నా కూడా ఎన్నికలనాటికి వారంతా కోటంరెడ్డి వైపు వస్తారని అంటున్నారు. సో.. ఎలా చూసుకున్నా 2024లో కోటంరెడ్డి తన సొంతబలం ప్లస్ టీడీపీ ఓటుబ్యాంక్ తో మరింత పటిష్టంగా బరిలో దిగుతారు. ఆయన్ను ఎదుర్కోడానికి ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సర్వశక్తులు ఒడ్డబోతున్నారు. ఈ ఆసక్తికర పోరులో ఎవరు విజేతగా నిలుస్తారో చూడాలి.

## దాడికి పాల్పడిన టీడీపీ సభ్యులపై ఎస్సీ కేసు నమోదు చేయాలి

**అమరావతి**

అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ లో వైకాపా ఎమ్మెల్యేలు మట్లాడారు. ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇవాళ బ్లాక్ డే. బీసీ వర్గానికి చెందిన సభాపతిపై టీడీపీ ఎమ్మెల్యేలు సభలో దాడి చేశారు. ఆయనపై చేయి చేసుకున్నారు. టీడీపీ శాసనసభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. సభను సజావుగా సాగనివ్వకుండా టీడీపీ సభ్యులు అడ్డుకుంటున్నారు. హక్కులు ఉన్నాయని చెప్పటమే తప్ప వారు సరైన ప్రజాస్వామ్య పద్ధతిలో సభా సాంప్రదాయాలను అనుసరించటం లేదు. చంద్రబాబు డైరెక్షన్ ప్రకారం ఏదో విధంగా సభలో అల్లరి చేయాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. అసెంబ్లీలో ఇవాళ టీడీపీ సభ్యుల తీరు మితిమీరిపోయింది. స్పీకర్ గారి మీదకి దాడి చేయటానికి ప్రయత్నించి, టీడీపీ ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి స్పీకర్ పోడియం దగ్గరకు వెళ్లి, ఆయన్ను చేతితో పొడవటం, దౌర్జన్యం చేసి స్పీకర్ ను అమానించడం జరిగింది. దాన్ని చూసి నేను స్పీకర్ పోడియం వద్దకు వెళితే.. టీడీపీ ఎమ్మెల్యే వీరాంజనేయ స్వామి, నా చేతిని పట్టుకుని నన్ను కూడా తోసేయటం జరిగింది. అప్పుడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు కిందకు లాగటం జరిగింది. సుధాకర్ బాబు మీదకి కూడా టీడీపీ సభ్యుడు దాడి చేయటం జరిగింది. స్పీకర్ గారిని కాపాడటం కోసం మేం వెళ్లాం. శాసనసభకు సభాపతిగా ఉన్న బీసీ నాయకుడిని ఈ రకంగా అవమానించటం, మర్యాద ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరంగా ఉంది. సభలో ఈ దుర్మార్గపు చర్యలకు పాల్పడటాన్ని ఖండిస్తున్నాం. మా పార్టీ ఎమ్మెల్యే సుధాకర్ మీద దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

# ఆర్టీసీ కోల్ టూరిజం...

**అదిలాబాద్ :**

సిరులగని సింగరేణి! 134 ఏళ్ల చరిత్ర కలిగిన సంస్థ. కడుపులో నల్లబంగారాన్ని దాచుకున్న నేల. భూమిలో దాగిన అపార బొగ్గురాశి నిల్వలు దేశానికి వెలుగు దారులను పంచుతుంటాయి! అలాంటి సింగరేణిలో కోల్ ఎలా వెలికితీస్తారు? బావుల్లో పరిస్థితులు ఎలా ఉంటాయి? ఆక్సిజన్ ఎంత వరకు అందుతుంది? భూగర్భంలో ఎంత వేడి విడుదలవుతుంది. తేడావస్తే ఏం జరుగుతుంది? కార్మికులు ఏ కండిషన్లో పని చేస్తారు? ఎంత లోతుకు వెళతారు? ఎలా లోపలికి పోతారు? ఎలా బయటకి వస్తారు? బొగ్గును ఎలా తరలిస్తారు? సొరంగాల్లో యంత్రాలు ఎలా పనిచేస్తాయి. అక్కడ తవ్విన బొగ్గును పైకి ఎలా తరలిస్తారు? ఇవన్నీ ఆసక్తిరేపే ప్రశ్నలు. తట్ట, చెమ్మ, వ్యవహారం చాలామందికి తెలియదు. అలాంటి ఇంట్రస్ట్ విషయాలను తెలుసుకునేందుకు పెట్టిందే కోల్ టూరిజం!నిత్యం మృత్యువుని వీపున మోసుకుంటూ నడిచేదే సింగరేణి కార్మికుడి జీవితం! కష్టాన్ని ఒక భుజంపై, మృత్యువును మరో భుజం ఎత్తుకుని వెళుతుంటాడు. అలాంటి పనిని కళ్లారా చూస్తే.. ఎవరైనా సలాం కొట్టాల్సిందే! లోపలికి వెళ్లడం మాత్రమే వారి చేతుల్లో ఉంటుంది. బయటకి రావడం తలరాత మీద ఆధారపడి ఉంటుంది! అంటే, సింగరేణి కార్మికుడి బతుకు దినదినగడం నూరేళ్ల ఆయుష్షు! అలాంటి రాకాసి బావులను ఒక కామన్ మ్యాన్‌గా ఎవరూ ప్రత్యక్షంగా చూడలేరు! పర్మిషన్ ఇవ్వరు! అలాంటి వారికోసం తెలంగాణ ఆర్టీసీ, సింగరేణి సంయుక్తంగా కోల్ టూరిజం-సింగరేణి దర్శన్ పేరుతో టూరిజం ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది! సింగరేణి - టీఎస్ఆర్టీసీ ప్రారంభించిన కోల్‌టూరిజం-సింగరేణి దర్శన్ ప్యాకేజీకి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి శనివారం హైదరాబాద్ జేబీఎస్ నుంచి సింగరేణి దర్శన్ పేరుతో ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. ఒక్కరికి రూ. 1,600 టికెట్. జేబీస్ నుంచి స్టార్టయి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జీడికే 7 ఎల్ఈపి కోల్‌మైన్ దగ్గరకు బస్సు చేరుకుంటుంది. అక్కడ పర్యాటకులకు మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. హార్ట్ బీట్, బీపీ, పల్స్ రేట్, బ్రీథింగ్ టెస్ట్ వగైరా చెక్ చేస్తారు! ఎందకంటే, వాళ్లు వెళ్లేది భూగర్భంలోకి కాబట్టి! ముందుజాగ్రత్త! ఆ తర్వాత టూరిస్టులను మ్యాన్ రైడింగ్ సిస్టమ్ ద్వారా బొగ్గుబావిలోకి తీసుకెళతారు. సింగరేణి అధికారే గైడ్‌గా వ్యవహరిస్తాడు. కోల్ మైన్ విశేషాలను ఆయన వివరిస్తుంటాడు.ప్రస్తుతం సింగరేణి బొగ్గు బావుల్లో అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నారు. గతంలో భూగర్భంలో బొగ్గును బ్లాస్టింగ్ చేసి టబ్బుల్లో నింపేవారు. బొగ్గు టబ్బులను రోప్ ద్వారా పైకి పంపేవారు. ప్రస్తుతం కంటిన్యూ మైనర్, ఎస్‌డీఎల్ వంటి మెషినరీని వాడుతున్నారు. ఈ పద్ధతిలో బొగ్గును కట్ చేసి, షటిల్ కార్ మెషీన్‌లో పోస్తారు. అక్కడ నుంచి కన్వేయర్ బెల్ట్ ద్వారా కోల్ పైకి చేరుతుంది. ఇదంతా మనం ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.భూగర్భంలో బొగ్గు బ్లాకులు ఎలా ఉంటాయి? బొగ్గు తవ్విన తర్వాత వాటిని ఎలా భర్తీ చేస్తారు? అనే విషయాలను కూడా యాత్రికులకు ప్రత్యక్షంగా చూపిస్తారు. ఇక భూగర్భంలోకి గాలి ఎలా వస్తుంది? ఒకవేళ గ్యాస్ లీక్ అయితే చేపట్టే చర్యలను కూడా వివరిస్తారు. బొగ్గుబావుల సందర్శన తర్వాత లంచ్ ఉంటుంది. టూరిస్టుల కోసం సింగరేణి గెస్ట్ హౌజ్‌లో ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ఆ తర్వాత ఓపెన్ కాస్ట్ మైన్ టూర్ ఉంటుంది. టూరిస్టులను ఖీఉ-2 ాఖఅ3 ఉపరితల బొగ్గు గని దగ్గరకు తీసుకెళతారు. అక్కడ బ్లాస్టింగ్ జరిగే విధానం, పేలుళ్ల తర్వాత బొగ్గు పైకి తీసుకొచ్చే యంత్రాల పనితీరును లైవులో చూపిస్తారు. తర్వాత మంచిర్యాల జిల్లాలోని జైపూర్ పవర్ ప్లాంట్ చూపిస్తారు. దాంతో కోల్ టూరిజం ప్యాకేజీ ముగుస్తుంది.రూ.1600 రూపాయలకే ఒక్క రోజులో ఇవన్నీ సందర్శించే అవకాశం కల్పించింది సింగరేణి సంస్థ. అందుకే కోల్ టూరిజం ప్యాకేజీకి విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సింగరేణి సందర్శన కోసం పెద్ద ఎత్తున టూరిస్టులు తరలివస్తున్నారు. సింగరేణి-ఆర్టీసీ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. బొగ్గుబావులు, ఓపెన్ కాస్ట్ మైనింగ్, థర్మల్ పవర్ ప్రాజెక్టు చూసి పబ్లిక్ థ్రిల్ అవుతున్నారు.

# రైతుకు పరిహారం ఇచ్చే దిక్కులేదు

**వికారాబాద్**

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల సోమవారం నాడు మోమిన్ పేట మండలం అమ్రవాది కుర్ద్ గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించారు. వడగండ్ల వానకు సర్వం నష్టపోయామని రైతలు వైఎస్ షర్మిలకు వివరించారు.

షర్మిల మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోనే కనీసం 6 వేల ఎకరాల పంట నష్టం జరిగింది. . ప్రతి రైతు నష్ట పోయాడు. . రైతులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా ఎంటి..? ఇంత వరకు ఒక్కరూ కూడా పరిశీలన కు రాలేదు. ఎంత నష్టం జరిగింది అనేది అంచనా కూడా లేదు. నష్ట పరిహారం పై పరిహారం ఇచ్చే దిక్కు కూడా లేదు. ఓట్లు వేయించుకోవడానికి తప్పా రైతులు ఎలా బ్రతుకు తున్నారు అని పట్టింపు లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 1250 కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనా. రైతులు భయపడకండి అనే భరోసా కూడా ఇప్పటికీ ముఖ్యమంత్రి ఇవ్వలేదు. రెండు వారాల్లో పంట చేతికి వచ్చే సమయంలో రైతు ఆగం అయ్యాడని అన్నారు.

అసలు తెలంగాణ లో ప్రతి ఏడాది పంట నష్టం జరిగితే పట్టించు కొనే దిక్కు లేదు. 2018 -19 లో 960కోట్ల మేర పంటనష్టం జరిగింది. 2019-20లో 990 కోట్ల మేర పంటనష్టం జరిగింది. 2020-21 లో 500కోట్లు, 2021-22లో 1000కోట్లు, ఇప్పుడు 1250 కోట్ల నష్టం వాటిల్లింది. ప్రతి ఏడాది ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇచ్చింది లేదు. మంత్రులు వస్తారు...గాలి మోటర్లలో తిరుగుతారు. లెక్కలు తీస్తారు..తర్వాత మోసం చేస్తారు. పరిహారం ఇవ్వడానికి మాత్రం మొహం చాటేస్తరు. వైఎస్సార్ ఉన్నప్పుడు పంట నష్టం జరిగితే పరిహారం తో పాటు బోనస్ కూడా ఇచ్చే వాడు. ఇప్పుడు రూపాయి కూడా పరిహారం ఇచ్చే దిక్కు లేదు. పండుగలా ఉన్న వ్యవసాయాన్ని దండుగ చేశాడు కేసీఅర్. మొత్తం 30 వేలు ఇచ్చే సబ్సిడీ పథకాలు బంద్ పెట్టాడు. రాష్ట్రంలో కేసీఅర్ దరిద్రపు పాలనకు 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు గౌరవంగా బ్రతకడం లేదని ఆమె అన్నారు.

# బీజేపి నిరసన

**నిర్మల్**

ఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కి బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు నిర్మల్ జిల్లా బిజెపి నాయకులు తెలుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టి.ఎస్.పి.ఎస్.సి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం నిరుద్యోగులను సామాన్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటూ ఉద్యోగాలు రోడ్డు కీడ్చిన లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తన మంత్రి వర్గానికి రాజీనామా చేసి సదరు వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. టి ఎస్ పి ఎస్ సి పరీక్షలను సైతం సరిగా నిర్వహించలేని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి బాధ్యత వహించి కేటీఆర్ ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉద్యోగ ప్రకటన కోసం నిరీక్షిస్తున్న రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి పరీక్షలకు సన్నద్ధమై పరీక్షలు రాయగా, కొందరు వ్యక్తులు రాజకీయ నాయకుల అండతో దొడ్డి దారిన ప్రశ్నాపత్రాలను బయటకు తెచ్చి అమ్ముకుంటూ నిరుద్యోగుల పొట్ట కొడుతున్నారని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుకున్న సదరు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, దీనికి బాధ్యత వహించి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## కోర్టులో భాస్కరరెడ్డి పిటీషన్

**హైదరాబాద్,:**

మాజీ ఎంపీ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ భాస్కర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. వివేకా హత్య కేసులో ఏ-4 గా ఉన్న దస్తగిరిని అప్రూవర్?గా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ భాస్కర్ రెడ్డి ఈ పిటిషన్ వేశారు. దస్తగిరి స్టేట్‌మెంట్ ఆధారంగానే అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలను సీబీఐ విచారణ చేయగా.. అసలు దస్తగిరిని అప్రూవర్?గా ఎలా ప్రకటిస్తారని భాస్కర్ రెడ్డి అంటున్నారు. ఈ మేరకు ఆయన్ను అప్రూవర్?గా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దస్తగిరి స్టేట్‌మెంట్ ను ఆధారంగా చేసుకొని తమను ఈ కేసులోకి లాగడం కరెక్టు కాదని పిటిషన్‌లో వైఎస్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించారని, అలాంటి ఆయనకు బెయిల్ ఇవ్వడం కూడా సరికాదని పిటిషన్‌లో వివరించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలకంగా ఉన్న ఆయుధాన్ని కొనుగోలు చేసింది దస్తగిరే అని గుర్తు చేశారు. దస్తగిరి బెయిల్ సమయంలోను సీబీఐ సహకరించిందని, దస్తగిరిపై ఉన్న ఆధారాలను కింది కోర్టు పట్టించుకోలేదని అన్నారు. దస్తగిరికి ఇచ్చిన బెయిల్?ను రద్దు చేయాలని పిటిషన్‌లో భాస్కర్ రెడ్డి కోర్టును కోరారు.వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు సీబీఐకి అప్పగించిన తర్వాత నిందితుల్లో ఒకరైన షేక్ దస్తగిరి అప్రూవర్ గా మారారు. వివేకానంద రెడ్డి హత్యకు దారి తీసిన పరిస్థితులు, హత్యలో ఎవరెవరు పాల్గొన్నారు.. లాంటి విషయాలన్నీ దస్తగిరి కోర్టు ముందు చెప్పినట్లుగా తెలుస్తోంది. సీబీఐ కూడా దస్తగిరి వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. అయితే సీబీఐ విచారణ తీరుపై భాస్కర్ రెడ్డి, ఎంపీ అవినాశ్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలంలో దొరికిన లేఖపై విచారణ జరపకుండా, నిందితుల్లో ఒకరిగా ఉన్న దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా తమను కేసులోకి లాగి విచారించడం సరికాదని అంటున్నారు. దీనిపై ఇప్పటికే అవినాశ్ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరగా కోర్టు తిరస్కరించింది. తాజాగా భాస్కర్ రెడ్డి దస్తగిరికి బెయిల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు.మార్చి 12న కడప సెంట్రల్ జైలు గెస్ట్ హౌజ్‌కు సీబీఐ విచారణ కోసం వచ్చిన వైఎస్ భాస్కర్ రెడ్డి వెనక్కి వెళ్లిపోయారు. విచారణ చేయాల్సిన సీబీఐ అధికారి లేకపోవడంతో ఆయన తిరిగివెళ్లిపోయారు. ఆ రోజు విచారణకు హాజరు కావాలని భాస్కర్ రెడ్డికి గతంలో నోటీసు అందింది. ఆ ప్రకారం భాస్కర్ రెడ్డి విచారణకు కడప సెంట్రల్ జైలు గెస్ట్ హౌజ్‌కు వచ్చారు. ఆ సందర్భంగా భాస్కర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. విచారణ తేదీని సీబీఐ అధికారులు మళ్లీ తెలియజేస్తామని చెప్పారని తెలిపారు. హత్య జరిగిన స్థలంలో దొరికిన లేఖపై సీబీఐ ఎందుకు విచారణ చేపట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. మీ కుమారుడు అవినాష్ రెడ్డితో పాటు మిమ్మల్ని కూడా అదుపులోకి తీసుకుంటామంటూ సీబీఐ తరఫున న్యాయవాది తెలంగాణ హైకోర్టుకు తెలియజేసిన అంశాన్ని మీడియా ప్రతినిధులు అడగ్గా.. తాము దేనికైనా సిద్ధమని భాస్కర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## కిషన్ రెడ్డి తో జాజుల శ్రీనివాస్ గౌడ్ భేటి

**హైదరాబాద్**

బిసి జనగణన పై జాతీయ స్థాయిలో ఆఖిలపక్ష సమావేశం పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అద్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ డిమాండ్ చేసారు. ఈ మేరకు హైదరబాద్ లోని బిజెపి రాష్ట్ర పార్టి కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని బిసీల ప్రతినిధుల బృందం కలిసివినతి పత్రం సమర్పించారు.బిసీ డిమాండ్లపై ప్రదాని నరేంద్ర మోదీ గారీని ఒప్పించాలని జాజుల కిషన్ రెడ్డి ని కోరారు.కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బాస్కర్ తదితరులు ఉన్నారు.

# ఖమ్మం మార్కెట్ అంతర్జాతీయ మార్కెట్ కి చిరునామాగా చేస్తాం

**తేజ రకం మిర్చికి రికార్డు స్థాయిల్లో ధరలు..**

**క్వింటాల్‌కు రూ.25,550**

**జెండా పాటలో పాల్గొన్న మంత్రి పువ్వాడ**

**ఖమ్మం**



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం కొత్త మిర్చికి రికార్డు స్థాయిలో ధర పలికింది. ఖమ్మం మార్కెట్ చరిత్రలో అత్యధికంగా క్వింటాల్ మిర్చికి రూ. 25,550 పలకడం ఇదే ప్రథమం.ఖమ్మం మార్కేట్ ను అంతర్జాతీయ మార్కేట్ కు చిరునామాగా తీర్చిదిద్దుతామని చిల్లీస్ కు హబ్ గా చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.సోమవారం ఖమ్మం వ్యవసాయ మిర్చి మార్కేట్ నందు నిర్వహించిన జెండా పాటలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని జెండా పట్టి ధర నిర్ణయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో ఖమ్మం మిర్చి మార్కెట్ లో రికార్డు స్థాయిలో ధర పలికింది అని పేర్కొన్నారు.కొన్ని క్వింటాలే కాదు...రైతులు పండించిన ప్రతి బస్తాలను కొనుగోలు చేస్తామని ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదని తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం లాభసాటిగా మారిందని, మనం పండించే మిర్చి అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందన్నారు.ఖమ్మంలో చైనా దేశం మిర్చి కంపెనీలు ఖమ్మంలో ఏర్పాటు చేసి చైనా కి క్వాలిటీ మిర్చి ఎగుమతి చేస్తున్నామన్నరు.మిర్చి ఘట్ కంటే రైతుల మీద ప్రేమ ఎక్కువ అని, అందుకే రైతుల ప్రయోజనాలు ముఖ్యమని అన్నారు. ఈకార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ దరిపల్లి శ్వేత తదితరులు పాల్గొన్నారు ....

# శాసనసభలో గొడవకు చంద్రబాబే కారణం

**అమరావతి**

సోమవారం ఉదయం అసెంబ్లీలో జరిగిన ఘటనకు చంద్రబాబే కారణమని వైకాపా ఎమ్మెల్యే సుధాకర్ బాబు ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్యేలతో మాపై దాడి చేయించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాలి. తనపై టీడీపీ ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి దాడి చేశారని అన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై నా.. అంటూ టీడీపీ శాసనసభ్యుడు డోలా దూషణలు రేసారు. - ప్రజాస్వామ్యంలో ఇవాళ ఒక బ్లాక్ డే. బలహీన వర్గాలకు చెందిన స్పీకర్ తమ్మినేని సీతారాం మీద చంద్రబాబు ఒక ప్లాన్ ప్రకారం దాడి చేయించారు. ప్రతిరోజు పేపర్లు చింపటం, ఫ్లకార్డులు మొహం మీద పెట్టడం, విసిరివేయడం.. స్పీకర్ గారిని పదే పదే అవమానించటం వంటివి చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి సభాపతిపై దాడి చేయబోతే ఎమ్మెల్యే ఎలీజా గారు సభాపతిని తాకనివ్వకుండా చేయి అడ్డు పెట్టం జరిగింది. టీడీపీ సభ్యులు అంతా నెడుతుంటే ఎమ్మెల్యే ఎలీజాని కాపాడటం కోసం పోడియం పైకి వెళ్తే.. నన్ను అగ్రవర్ణానికి చెందిన బెందాళం అశోక్ దారుణాతిదారుణంగా తిట్టి తోసేశారు. దాంతో నా చేతికి గాయమైందని దెబ్బ చూపించిన సుధాకర్బాబు. చంద్రబాబుకు ప్రజాస్వామ్య విలువల మీద నమ్మకం లేదు. వాయిదా తీర్మానం ఇవ్వటం, అసంబద్ధంగా మాట్లాడుతూ టీడీపీ శాసనసభ్యుల్ని పంపి దాడి చేయించారు. తక్షణమే ఆ విజువల్స్ను స్పీకర్ పరిశీలించి, ఎవరైతే మా మీద దాడికి పాల్పడ్డారో ఆ టీడీపీ ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి, చర్యలు తీసుకోవటంతో పాటు, మాకు రక్షణ కల్పించాలని వేడుకొంటున్నాం. మా పార్టీకి 151 మంది శాసనసభ్యులు ఉంటే ఇలా దాడి చేశారు. చంద్రబాబు ఎటూ శాసనసభకు రావట్లేదు కాబట్టి, సభ సవ్యంగా జరగకూడదని, అరాచకాలు చేసి, గందరగోళం సృష్టించాలని ఆయన కోరుకుంటున్నారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర తెల్సిన వారు ఎవరైనా.. ఇవాళ జరిగిన సంఘటన చంద్రబాబు చేయించినదేనని చెబుతారు. కొండేపి ఎమ్మెల్యే బాల వీరంజనేయస్వామి ఫ్లకార్డులు, పేపర్లు పట్టుకొని ప్రతిరోజు సభాపతిని అవమానించేలా వ్యవహరిస్తున్నారు. చిట్టచివరకు అగ్రవర్ణాల ఎమ్మెల్యేతో మా మీద దాడి చేయించారు. దీని మీద చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు.

# బీసీలు, ఎస్సీల మధ్య ఘర్షణలకు బాబు కుట్ర

**డిప్యూటీ సీఎం నారాయణ స్వామి**

**అమరావతి**

శాసనసభలో బీసీలు, ఎస్సీల మధ్య ఘర్షణలకు చంద్రబాఉ కుట్ర చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ఆరోపించారు. నన్ను కూడా రేయ్ నా.కొ. అని అసభ్యంగా మాట్లాడారు. బీసీలను బీసీలతో, ఎస్సీలను ఎస్సీలతో, రెడ్లను రెడ్లతో చంద్రబాబు తిట్టిస్తారు. ఒక ఎస్సీ ఎమ్మెల్యేతో బీసీ వర్గానికి చెందిన స్పీకర్ మీద దాడి చేసి లబ్ధి పొందాలని చంద్రబాబు చూస్తున్నారు. గతంలోనూ జగన్ గారి నేతృత్వంలో గెలిచిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్టు కొని, వారిలో కొందరికి మంత్రి పదవులు ఇచ్చి, అసెంబ్లీలో నానా తిటలు తిట్టించిన చరిత్ర చంద్రబాబుది. దాడికి పాల్పడిన ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. ఒక పవిత్రమైన సభాపతి స్థానంలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఉంటే చంద్రబాబు నాయుడుకి కక్ష, పగ, ద్వేషం తప్ప ఇంకేమీ కనపడటం లేదు. చంద్రబాబు నైతిక విధానం ఎలా ఉందంటే.. బీసీ, ఎస్సీలకు గొడవ పెట్టాలని చూశారు. ఒక ఎస్సీని రెచ్చగొట్టి (బాలవీరాంజనేయ స్వామి) స్పీకర్ మీద దౌర్జన్యం చేస్తే.. రకరకాలుగా లబ్ధిపొందాలని ఇలాంటి పనులు చంద్రబాబు చేస్తున్నారు. ఎస్సీలను ఎస్సీలతో, బీసీలను బీసీలతో తిట్టించే కార్యక్రమాలు చంద్రబాబు చేస్తారు. అసెంబ్లీలో ప్రభుత్వం నుంచి ప్రజలకు మంచి చేయాలనే కార్యక్రమాలు వదిలేసి ఎంతసేపూ కక్ష, పగ, ద్వేషంతో రగిలిపోతూ స్పీకర్ గారి మీద పడుతున్నారు. స్పీకర్ గారు కూడా బుద్ధుడు మాదిరిగా సహనంతో ఉన్నాడు కాబట్టి టీడీపీ శాసనసభ్యులు ఆటలు ఆడుతున్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యే వీరాంజనేయ స్వామిని అడ్డు పెట్టుకుని, అతనితో అసెంబ్లీలో దారుణాలు చేయించే చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లోనూ తగిన బుద్ధి చెబుతారు.
డిప్యూటీ సీఎంగా ఉన్న నన్ను కూడా రేయ్ నా.కొ. అని అసభ్యంగా మాట్లాడారు. దాడికి పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పెట్టి కఠిన శిక్ష విధించాల్సిందిగా కోరుచున్నాను. దాడులకు చంద్రబాబు ఎస్సీలను వాడుకున్నారు. ఎస్సీలు అంతా వైఎస్ఆర్సీపీ తరుపున గెలిచారు. ఒకే ఒకతను (బాలవీరాంజనేయ స్వామి) టీడీపీ తరుపున వస్తే అతన్ని చంద్రబాబు వాడుకుంటున్నారు. రాబోయే రోజుల్లో అతనికి (బాలవీరాంజనేయ స్వామి) ప్రజలే బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

# రైతుల పేరిట రాజకీయం వద్దు

**మంత్రి నిరంజన్ రెడ్డి**

**హైదరాబాద్**

రైతల పేరిట రాజకీయం వద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అకాలవర్షాలకు పంటనష్టంపై కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లేఖపై మంత్రి స్పందించారు. నాలుగేళ్లలో కాంగ్రెస్ ఎంపీలు ఎన్ని సమస్యల మీద ఎన్ని దీక్షలు చేశారు ? అకాలవర్షాల గురించి నాలుగు రోజుల ముందు నుంచే ప్రభుత్వం అప్రమత్తం చేస్తున్నదని అయన గుర్తి చేసారు. అకాలవర్షాలు కురిసిన 24 గంటలలోపే ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో పర్యటించడం జరిగింది. రాష్ట్రంలో దెబ్బతిన్న పంటలను అంచనా వేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించాం. వివిధ ప్రాంతాల్లో ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు పంట నష్టం జరిగిన వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు భరోసా కల్పిస్తున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కొరకు చేసే రాజకీయ దీక్షలను రైతులు గమనిస్తారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి ఒక ప్రజాప్రతినిధిగా కోమటిరెడ్డి గాని మరొకరు గాని తీసుకురావడం తమ బాధ్యత. కానీ రాజకీయ దురుద్దేశాలతో ప్రభుత్వాన్ని బద్ నాం చేయాలనే అలోచన సబబు కాదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు, వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయ అనుకూల విధానాలతో దేశంలోనే అగ్రగామిగా సాగుతున్నది. ప్రభుత్వ చర్యల మూలంగా ఈ యాసంగిలో 56.44 లక్షల ఎకరాలలో వరి సాగవుతున్నది. రైతుబంధు, రైతుభీమా, ఉచితకరంటు, సాగునీటి కల్పనతో రైతులలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రతి ఏటా వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నాయి. దేశంలో సగటు ఉత్పత్తిలో ప్రథమ స్థాయిలో వుంది. తెలంగాణ వరి ధాన్యం కొనమని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెబితే ఒక్క కాంగ్రెస్ నేత ఎందుకు ప్రశ్నించలేదు ? ఎందుకు దీక్షలు చేయలేదు ? అకాలవర్షాలతో వచ్చిన పంటనష్టం మీద రాజకీయం చేయడం దురదృష్టకరం. మీ గత పాలనలో రైతుల పడ్డ గోస గుర్తు చేసుకోండని అన్నారు.

# అకాల వర్షాలకు 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం

**హైదరాబాద్**

అకాల వర్షంతో రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. మామిడి, మొక్కజొన్న, ఇతర పంటలు అకాల వర్షానికి బాగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కామారెడ్డి జిల్లా పాదయాత్రలో భాగంగా అంకోల్ గ్రామంలో మాట్లాడారు రేవంత్ రెడ్డి. సహకార కేంద్ర బ్యాంకులో రుణాలు తీసుకున్నాం తమను బ్యాంకు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని రైతులు రేవంత్ రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. డబ్బులు లేకుంటే ఇంట్లోంచి ల్యాప్ టాప్ తీసుకెళ్లారని ఓ రైతు బాధను రేవంత్ రెడ్డికి తెలిపాడు. రాష్ట్రంలో నష్టపోయిన పంటల నివేదికలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించి పరిహారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ హయాంలో రైతులకు పంట నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు.తెలంగాణ ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పనిముట్లకు సబ్సిడీ ఇవ్వడం లేదని అన్నారు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఎకరాకు 40వేల వరకు సాయం అందించిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు రేవంత్. కేసీఆర్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని నీరుగార్చిందన్నారు. ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలు కావడంలేదన్నారు. దీంతో ఇలాంటి సమయంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు రేవంత్ రెడ్డి. పంటల బీమా పథకం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి.2021లో బాన్సువాడ నియోజకవర్గంలో ఒకే మండలంలో 8 వేల ఎకరాల పంట నష్టం జరిగింది. 15 నెలలుగా రైతులకు పరిహారం అందించలేదు. వరి పంటకు ఒక బస్తాకు 5 కిలోలు తరుగు తీస్తూ రైతులను నిండా దోచుకుంటున్నారని విమర్శించారు. పోచారం కొడుకులు అచ్చొసిన ఆంబోతుల్లా ఊరుమీద పడి తిరుగుతున్నారు. కేసీఆర్ సావాస దోషంతో పోచారం శ్రీనివాస్ రెడ్డి పూర్తిగా మారిపోయారని అన్నారు రేవంత్ రెడ్డి. పోచారం తన ఇంటి పేరు పైసల శ్రీనివాస్ గా మార్చుకున్నారని ఆరోపించారు రేవంత్. తండ్రీ కొడుకులు నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని..... తక్షణమే ప్రభుత్వం ఎకరాకు రూ.15వేలు పంట నష్టం వెంటనే రైతులకు అందించాలని డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉత్సవ విగ్రహాలుగా మారారు. పంట నష్టం జరిగి రైతులు బాధపడుతుంటే బీజేపీ నేతలు ఎందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించడం లేదని ప్రశ్నించారు రేవంత్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని అన్నారు. కేంద్రం తక్షణమే బృందాలను పంపి ఇన్ పుట్ సబ్సిడీ అందించాలి. 2021 లో జరిగిన పంట నష్ట పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులను వెంటనే ఆదుకోవాలి. రైతు బీమా కాదు.. పంట బీమా పథకం కేసీఆర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు రేవంత్. రైతు చనిపోతేనే డబ్బులు ఇస్తానంటున్న కేసీఆర్ మనిషి రూపంలో ఉన్న రాక్షసుడు. రైతు ఆత్మహత్యలన్నీ కేసీఆర్ ప్రభుత్వ హత్యలే ఆరోపించారు రేవంత్ రెడ్డి. తక్షమే రాష్ట్రంలో పంట నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలి. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని అన్నారు రేవంత్ రెడ్డి.

## బీఆర్ఎస్ లో మళ్లీ అసంతృప్తి జ్వాలలు

**ఖమ్మం**



ఖమ్మం బీఆర్ఎస్ లో మళ్లీ అసంతృప్తి మొదలవుతోంది. మాజీ ఎంపీ పొంగులేటి రాజేసిన నిప్పు ఇప్పుడు ఇతర నేతలకు పాకుతోంది. నేతలు బహిరంగ విమర్శలకే దిగుతున్నారు. ఒక పక్క రెబల్ స్టార్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పార్టీకి దూరం జరుగుతుంటే ఇతర నేతలు కూడా ఐకమత్యం లేక ఎవరికీ వారే యమునా తీరే అన్నట్లుగా తయారయ్యారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక చోట మాత్రమే గెలిచింది. ఖమ్మంలో గెలిచిన పువ్వాడ అజయ్ రవాణా మంత్రిగా సేవలందిస్తున్నారు. జిల్లాలో ఆయన ఏకపక్ష ధోరణిని ప్రదర్శిస్తున్నారన్న టాక్ నడుస్తోంది. ఆయన తీరు కూడా బీఆర్ఎస్ నేతలకు ఇబ్బందిగా మారింది.ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఇప్పుడు పువ్వాడ తీరుపై బహిరంగ అసంతృప్తిని వ్యక్తపరిచారు. నేరుగా పేరు చెప్పకపోయినా తనను ఏ కార్యక్రమానికి పిలవడం లేదంటూ ఆవేదన చెందారు. కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో నామా చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ వర్గాల్లో దుమారం రేపాయి. పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు తనను పిలవడం లేదని నామా నాగేశ్వరరావు చేసిన కామెంట్స్ బీఆర్ఎస్ లో సంచలనమయ్యాయి.ఎక్కడికి పిలిచినా వస్తానని చెప్పినా కూడా పిలవడం లేదని నామా నొచ్చుకున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో తనను కూడా భాగస్వామిని చేయాలని నామా స్థానిక నేతలను వేడుకోవడంతో అంతా షాక్ అయిన పరిస్థితి నెలకొంది. తనతో విభేదాలపై ఓపెన్ గా చెబితే సరిదిద్దుకుంటానని వివరించారు.మొత్తంగా నామా వ్యాఖ్యలు ఇప్పుడు బీఆర్ఎస్ లో కొత్త చర్చకు దారితీశాయి. ఇప్పటికే పొంగులేటితో తలనొప్పిలు తెచ్చుకుంటున్న కేసీఆర్ కు ఇప్పుడు సిట్టింగ్ ఎంపీ నామా తీరు కూడా కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టడం ఖాయమని అంటున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ఆసియాలోనే అతి పెద్ద మురుగునీటి శుద్ధి ప్లాంటు

**హైదరాబాద్ :**

హైదరాబాద్ జలమండలికి ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. ప్రఖ్యాత మేగజైన్ వాటర్ డైజెస్ట్ 65 కేటగిరీల్లో అవార్డులు ఇచ్చింది. ప్రభుత్వ విభాగంలో 2022 - 23కి గానూ జలమండలి ఉత్తమ ఎస్టీపీ అవార్డ్ పొందింది. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు ఈ పురస్కారం అందుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ జలమండలి చేసిన కృషిని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ శెకావత్ ప్రశంసించారు. హైదరాబాద్ లో వెలువడే మురుగునీటిని వందశాతం శుద్ధిచేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని జలమండలి ఎండీ దానకిషోర్ తెలిపారు. నగరంలో అందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించడంతో పాటు, ఉత్పన్నమయ్యే మురుగును శుద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు జలమండలి ఎండీ దానకిశోర్. దేశంలోనే వందశాతం మురుగు నీటిని శుద్ధి చేస్తున్న నగరంగా హైదరాబాద్ పనిచేస్తోందని కేంద్రమంత్రి గజేంద్రసిగ్ శెకావత్ ప్రశంసించారు. నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన గుర్తుచేశారు. నీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ గుర్తు చేశారు.భారతదేశంలోనే మొట్ట మొదటిసారిగా వందశాతం మురుగు నీటి శుద్ధికోసం రూ.3866 కోట్ల వ్యయంతో హైదరాబాద్ నగరంలో 62 ఎస్టీపీలను సీవరేజ్ మాస్టర్ ప్లాన్ కింద తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 1650 మిలియన్ లీటర్ల మురుగు నీరు రోజూ ఉత్పత్తి అవుతున్నది. ఇందులో 772 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని 25 ఎస్టీపీల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో ప్యూరిఫై చేస్తున్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా మూసీలోకి వదులుతున్నారు. ఇంకా 878 ఎంఎల్డీల మురుగు జలాలు శుద్ధి చేయాల్సి ఉంది. దీనికోసం ప్రభుత్వం మొదటిదశలో కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణాన్ని 2022లో చేపట్టింది. ప్రస్తుతం ఆయా ప్లాంటుల నిర్మాణ పనులు వేగంగా నడుస్తున్నాయి. కొద్దినెలల్లో వాటి పనులు పూర్తవుతాయి. తద్వారా జీహెచ్ఎంసీ పరిధిలో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని వందశాతం శుద్ధి చేయవచ్చు. ఫలితంగా దేశంలోనే హైదరాబాద్ వందకు వందశాతం మురుగు నీటిని శుద్ధి చేసిన నగరంగా నిలవబోతోంది.మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో ఆసియాలోనే అతి పెద్ద ప్లాంటుగా అంబర్ పేట్ ఎస్టీపీ ప్రముఖమైంది. కూకట్ పల్లి నాలా నుంచి వచ్చే మురుగు నీరు నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ఎన్నో నాలాలను కలుపుకుంటూ అంబర్ పేట్ వద్దకు చేరుకుంటుంది. అక్కడ నిర్మించిన ప్లాంట్ ద్వారా నిత్యం 339 మిలియన్ గ్యాలన్ల డ్రయినేజ శుద్ధి అవుతుంది. అక్కడ శుద్ధయిన వాటర్ మూసీలోకి కలుస్తుందిసర్క్యులర్ ఎకానమీ అనే పద్ధతి ద్వారా ఇక్కడ శుద్ధిచేసిన మురుగు పార్కుల్లో చెట్ల పెంపకానికి, ప్రభుత్వ రంగంలో నిర్మాణాలకు వాడుతుంటారు. పలు సాఫ్ట్ వేర్ కంపనీలు తమ కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కల పెంపకానికి, మిగతా అవసరాలకు ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వాడుతున్నారు. నీటిలో మిగిలిపోయిన గట్టి పదార్థాలను బయోగ్యాస్ ఉత్పత్తికి వాడుతున్నారు.



# అంగన్వాడి వర్కర్ల అరెస్టు

**ఏలూరు**

అంగన్వాడీ వర్కర్ ల చలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు సోమవారం కూడా భగ్నం చేశారు.ఉద్యోగ భద్రత కల్పించాలని.ఉద్యోగాలను క్రమబద్ధీకరించి కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు అందజేయాలని, ఫేస్ యాప్ ను రద్దుచేయాలని కోరుతూ అంగన్వాడీలు జిల్లా వ్యాప్తంగా బయలుదేరి విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నా బహిరంగ సభకు కదంతొక్కారు.అంగన్వాడీలు చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని ముందుగానే పసిగట్టిన పోలీసు వర్గాలు ముందస్తు నిర్బందాలకు పూనుకున్నారు.ఈ క్రమం లోనే పోలీసులు అంగన్వాడీలు కదలికలపై న .యూనియన్ నాయకుల పైన నిఘా పెట్టారు.ఈ నేపథ్యం లోనే .ఆదివారం నుండే అంగన్వాడీ కార్యకర్తల కు ధర్నాలకు అనుమతి లేదని తెలుపుతూ ఇళ్లకు వెళ్లి నోటీసులు కూడా అందజేశారు.కొంతమంది అంగన్వాడీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పోలీసులు పెద్ద ఎత్తున హౌస్ అరెస్ట్ లు కూడా చేశారని సి ఐ టి యు నాయకులు ఆరోపిస్తున్నారు.ప్రజా స్వామ్యం లో అధికార ప్రభుత్వానికి తమ న్యాయమైన కోర్కెల ను తెలుపుకునేందుకు కూడా అనుమతి లేదని తెలుపుతూ అంగన్వాడీలు పోలీస్ స్టేషన్ లలో ప్రభుత్వ విధానాల పట్ల .పోలీసుల తీరు పట్ల తీవ్ర నిరసనలు తెలుపుతూ నినాదాలు చేశారు

# ఇమ్రాన్ ఖాన్ సౌధంలో మారణాయుధాలు..

**ఇస్లామాబాద్ :**

పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ సౌధంలో పలు మారణాయుధాలను పోలీసులు స్వాధీం చేసుకున్నారు. ఏకే-47 రైపిళ్లు, పెట్రోల్ బాంబులు ఇందులో ఉన్నట్టు భద్రతా బలగాలు తెలిపాయి. 16 ఏకే-47 రైఫిళ్లు, పేలుడు పదార్థాలను శనివారంనాడు స్వాధీనం చేసుకున్నట్టు పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ ఉస్మాన్ అన్వర్ తెలిపారు. పట్టుబడిన మారణాయుధాలను మీడియా ముందు ఆయన ప్రదర్శించారు. జమాన్ పార్క్ నుంచి పెట్రోల్ బాంబులు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కాగా, ఖాన్ నివాసంలో పట్టుబడిన ఆయుధాలకు చట్టబద్ధత (లైసెన్స్) ఉందా అనే విషయాన్ని నిర్ధారించాల్సి ఉందని, ఖాన్ నివాసానికి చేరకుండా ఏర్పాటు చేసిన షిప్పింగ్ కంటైనర్లను తొలగిస్తున్నామని ఐజీ ఉస్మాన్ అన్వర్ తెలిపారు.

### ఇమ్రాన్ ఉద్దేశం ఏమిటి?

ఇమ్రాన్ నివాసంలో పెద్దఎత్తున మారణాయుధాలు లభించడంతో ఆయన రాజకీయ ఉద్దేశాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వంపై యుద్ధాన్ని ప్రకటించే ఆలోచన ఆయనకు ఉందన్న ఆలోచనకు బలం చేకూరుతోందని అనుమానిస్తున్నారు. ఇమ్రాన్ నివాసంలోనే కాకుండా, ఆయన రాజకీయ కేంద్రమైన ఖైబర్ పఖ్తుంఖ్వాలోనూ భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. మరోవైపు, చట్టాన్ని



ధిక్కరించినందుకు 60 మందికి పైగా ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులను అరెస్టు చేసిన పాకిస్థాన్ మీడియా ప్రకటించింది. లాహోర్‌లో 144 సెక్షన్ అమలు చేస్తుండటంతో పాటు, ఇమ్రాన్ నివాసాన్ని వీడి వెళ్లిపోవాల్సిందిగా ఖాన్ మద్దతుదారులను పోలీసులు కోరుతున్నారు.

### పదివేల మందితో ముట్టడి?

తోషాఖానా కేసులో విచారణకు హాజరయ్యేందుకు ఇమ్రాన్ ఖాన్ శనివారంనాడు లాహోర్ నుంచి ఇస్లామాబాద్ బయలుదేరగానే సుమారు 10 వేల మంది పోలీసులు లాహోర్ జమాన్ పార్క్‌లోని ఆయన ఇంటిపైకి దూసుకు వెళ్లారు. మద్దతుదారుల క్యాంపులు, బారికేడ్లు తొలగించి, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అరెస్టుచేశారు. ఇరుపక్షాల తోపులాటంలో పోలీసులు సహా అనేక మంది గాయపడ్డారు. ఇమ్రాన్ నివాసంలో సోదాలు నిర్వహించాలని యాంటీ టెర్రరిజం కోర్టు వారెంట్లు జారీ చేయడంతోనే తాము ఆయన ఇంట్లోకి ప్రవేశించామని పోలీసులు చెబుతుండగా, తాను ఇంట్లో లేని సమయంలో ఏ చట్ట ప్రకారం పోలీసులు తన నివాసంపై దాడి చేశారంటూ ఇమ్రాన్ ఓ ట్వీట్‌లో ప్రశ్నించారు.

# సీన్ రీ కన్ స్ట్రక్షన్ లో పేపర్ లీకేజ్ నిందితులు

**హైదరాబాద్ :**

టీఎస్ పీఎస్సీ లీకేజీ వెనుక పాత్రధారి ఎవరు? సూత్రధారి ఎవరు? సిట్ ఎదుట లీకు వీరులు చెప్పిందేంటి? నిజం చెప్పారా. అబద్ధం చెప్పారా? సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తే ఏమేం ఆధారాలు దొరికాయి. ఏమేం స్వాధీనం చేసుకున్నారు? కాన్ఫిడెన్షియల్ రూంలోకి ఎలా వెళ్లారు? లాగిన్ ఐడీ, పాస్ వర్డ్ ఎలా సంపాదించారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. టీఎస్ పీఎస్సీలో పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని సర్కారు సీరియస్‌గా తీసుకుంది! నిందితులు ఎవరైనా సరే ఉపేక్షించవద్దని గట్టిగానే ఆదేశాలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో సిట్ ముమ్మరంగా దర్యాప్తు చేపట్టింది. టీఎస్ పీఎస్సీ కార్యాలయంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసి రెండు కంప్యూటర్లని స్వాధీనం చేసుకున్నారు సిట్ అధికారులు. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డిలను పిన్ టు పిన్ అడుగుతూ నేరం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి కంప్యూటర్‌ను నిందితుల సమక్షంలో పరిశీలించారు. ఐపీ అడ్రస్‌లు మార్చి కంప్యూటర్‌లోకి ఎలా చొరబడ్డారని విషయాలను ఆరాతీశారు.కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కంప్యూటర్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డులను శంకర్ లక్ష్మి డైరీ నుంచి దొంగిలించినట్లు ప్రవీణ్ సిట్ అధికారుల ముందు చెప్పాడు. అయితే డైరీలో ఎక్కడ కూడా లాగిన్ ఐడీ పాస్వర్డ్ రాయలేదని, ప్రవీణ్ చెప్పేది అబద్ధమని శంకర్ లక్ష్మి పోలీసులకు తెలిపారు. సిట్ అధికారులు కూడా అధికారి చెప్పింది వాస్తవమే అని, ప్రవీణ్ అబద్దాలు చెబుతున్నాడని గ్రహించారు. రాజశేఖర్ రెడ్డి ఐపీ అడ్రసులు మార్చి కంప్యూటర్లోకి చొరబడినట్లు పోలీసులు గుర్తించారు.అక్టోబర్ 16న జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ తో పాటు ఏఈ, డిఏఓ పరీక్ష ప్రశ్నాపత్రాలను ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి కలిసి లీక్ చేశారు. ఫిబ్రవరి 27 కంటే ముందునుంచే లీకేజీ వ్యవహారం నడిపించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. పేపర్ లీకేజ్ కేసులో ఇప్పటివరకు తొమ్మిది మంది నిందితులను కస్టడీలోకి తీసుకున్నారు సిట్ అధికారులు. 6 రోజుల పాటు 9మందిని సిట్ ప్రశ్నించబోతోంది. ఈనెల 23వరకు పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది నాంపల్లి కోర్టు

తొమ్మిది మంది నిందితులు వీళ్లే

ఏ -1 ప్రవీణ్ కుమార్,
ఏ -2 అట్ల రాజశేఖర్
ఏ -3 రేణుక రాథోడ్
ఏ -4 డాక్య
ఏ- 5 కేతావత్ రాజేశ్వర్
ఏ -6 కేతావత్ నీలేష్ నాయక్
ఏ -7 పత్లావత్ గోపాల్ నాయక్
ఏ -8 కేతావత్ శ్రీనివాస్
ఏ -9 కేతావత్ రాజేంద్ర నాయక్.

ఇప్పటికే నిందితులపై సెక్షన్ 420, 409, 120ః, ఎ యాక్ట్ 66 ః,అ : 70/ఎ యాక్ట్ సెక్షన్ 4 / తెలంగాణ పబ్లిక్ ఎగ్జామ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. పేపర్ లీకేజ్ వ్యవహారంలో నిందితుల ఆర్థిక లావాదేవీలపైనా సిట్ కూపీలాగబోతోంది. ఎగ్జామ్ పేపర్లు ఎవరెవరికి అమ్మారు? ఎంతకు అమ్మారు? డబ్బులు ఏ రూపంలో అందాయి అనే విషయాలపై సిట్ సవివరంగా దర్యాప్తుచేయబోతోంది.కమిషన్‌లో పనిచేసే ఇద్దరు చేసిన తప్పు వ్యవస్థకే చెడ్డపేరు తెచ్చిందని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి మాత్రమే కాదు.. ఈ లీకేజీ వ్యవహారం వెనుక ఇంకా ఎవరున్నా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీ క్రియాశీల కార్యకర్త అని కేటీఆర్ ఆరోపించారు. ఏదైనా కుట్రకోణం ఉందా అని పరిశీలించాలని డీజీపీని కోరుతున్నామని చెప్పారు కేటీఆర్. సిట్ విచారణ ఇంకా పూర్తి కాలేదు కాబట్టి, ముందే లేనిపోని అనుమానాలు సృష్టించవద్దన్నారు. త్వరలో వాస్తవాలన్నీ బయటకు వస్తాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మైదానాలు ఆరోగ్య ఆలయాలు

**హైదరాబాద్**

గచ్చిబౌలి లో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 100మీటర్స్ రన్ "స్ప్రింట్" ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమం కు ముఖ్య అతిథిగా శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ హాజరైనారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ క్రీడాకారులు ఏ రంగంలో ఉన్న మిగితా వారికంటే అత్యధిక ఫలితాలు ఆయా ,సంస్థలకు అందిస్తారు అని అన్నారు.క్రీడల ద్వారా మాత్రమే ఆరోగ్యం, ఉత్సాహవంతులైన ప్రతిభావంతులు సమాజానికి లభిస్తారని అన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపించిన సీఎం కెసిఆర్ క్రీడా రంగానికి కూడ అండగా నిలిచారాని వివరించారు. నిఖత్ జరిన్, ఈషా సింగ్ తదితర క్రీడాకారులకు రెండు కోట్ల రూపాయల నగదు, కోట్లాది రూపాయల విలువైన ఇళ్ల స్థలాలను



సీఎం కెసిఆర్ అందజెసారని అన్నారు. తెలంగాణ రాష్ట్రము లో క్రీడలు వర్ధిల్లిలానే దృక్పథంతో కెసిఆర్ ప్రభుత్వం చేయూత అందిస్తుందని అన్నారు. ప్రయివేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సైతం, క్రీడాకారులను, క్రీడా అసోసియేషన్ లకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమం లో స్లెట్ విద్యా సంస్థల అధినేత వాసిరెడ్డి అమరనాథ్ , అర్జున,ద్రోణచార్య అవార్డు గ్రహీతలు రమేష్, శోభ, అథ్లెటిక్ అసోసియేషన్ కి చెందిన ప్రొఫెసర్ రాజేష్, సారంగ పాణి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో రెండు వేలమంది కి పైగా క్రీడకారులు పాల్గొన్నారు

# వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తు ఆలస్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూ ఢిల్లీ :**

;తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తు ఆలస్యంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వివేకా హత్య కేసు విచారణ ఎంతవరకు వచ్చిందో చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణపై తాజా పరిస్థితిపై నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించాలని సీబీఐని న్యాయస్థానం ఆదేశించింది. అసలు ఇన్నిరోజులుగా వివేకా హత్య కేసు దర్యాప్తు ఎందుకు పూర్తి చేయడం లేదని సీబీఐపై సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. దర్యాప్తు అధికారి ఎందుకు విచారణను జాప్యం చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించించింది. విచారణ త్వరగా ముగించలేకపోతే వేరే దర్యాప్తు అధికారిని ఎందుకు నియమించకూడదో చెప్పాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దర్యాప్తు అధికారి సమర్ధవంతుడు కాకపోతే ఆయన స్థానంలో వేరొకరిని నియమించడంపై సీబీఐ డైరక్టర్ అభిప్రాయం అడిగి చెప్పాలని సీబీఐ తరపు న్యాయవాది నటరాజన్‌ను న్యాయస్థానం ఆదేశించింది.

### సుప్రీంలో పిటిషన్..!

కాగా.. వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ కేసులో దర్యాప్తు అధికారి రాంసింగ్ విచారణను జాప్యం చేస్తున్నందున మార్చాలని పిటిషన్‌లో ఆమె



కోరారు. దర్యాప్తు అధికారి సక్రమంగానే విచారణ చేస్తున్నారని సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. అనంతరం కేసు విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది. గతంలో రాంసింగ్‌పై వివేకా హత్య కేసులో నిందితులు కేసు పెట్టారు. ఈ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది.

వివేకా కేసులో కీలక పరిణామం..!

ఇదిలా ఉంటే.. తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డిపిటిషన్‌వేశారు. వివేక హత్య కేసులో ఏ-4 దస్తగిరినీ అప్రూవర్?గా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ భాస్కర్ రెడ్డి పిటిషన్ వేశారు. దస్తగిరి స్టేట్మెంట్ ఆధారంగానే అవినాష్ రెడ్డిభాస్కర్ రెడ్డిలను సీబీఐ విచారించింది. కాగా.. దస్తగిరినీ అప్రూవర్?గా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ లో..'దస్తగిరి స్టేట్మెంట్ ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. సీబీఐ చెప్పినట్లుగా దస్తగిరి స్టేట్మెంట్ ఇస్తున్నారు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. కీలక పాత్ర పోషించిన దస్తగిరి కి బెయిల్ ఇవ్వటం సరికాదు. వివేక హత్య కేసులో కీలకంగా ఉన్న ఆయుధాన్ని కొనుగోలు చేసింది దస్తగిరినే.. బెయిల్ సమయంలోను సీబీఐ సహకరించింది. దస్తగిరిపై ఉన్న ఆధారాలను కింది కోర్టు పట్టించుకోలేదు. దస్తగిరికి ఇచ్చిన బెయిల్?ను రద్దు చేయాలి' అని పిటిషన్‌లో భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

# పంట నష్టపోయిన రైతులనుతప్పకుండా ఆదుకుంటాం

**హైదరాబాద్**


ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులనుతప్డకుండా ఆదుకుంటామని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డిస్పష్టం చేశారు. బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, సండ్ర వెంకట వీరయ్య, గండ్ర వెంకట రమణారెడ్డితో కలిసి పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పరిశీలించారని రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. కేంద్రం ఎలాంటి సహాయం చేయకున్నా రైతులను ఆదుకుంటున్నామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని స్పష్టం చేశారు. పంట నష్టం అంచనాలు పూర్తయ్యాక రైతులను తప్పకుండా తప్పకుండా ఆదుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి బృందాలను పంపించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై కూడా ఉందన్నారు. పంట నష్టంపై గతంలో కేంద్రానికి ఎన్నిసార్లు అంచనాలు పంపినా నిధులు ఇవ్వలేదని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం లేని రాష్ట్రాలకు కేంద్రం ఏ రకంగానూ సహాయపడటం లేదన్నారు. కేంద్రం తెచ్చిన ఫసల్ బీమా యోజనతో రైతులకు ఎలాంటి లాభం లేదన్నారు. ఫసల్ బీమా యోజనతో రైతులకు నష్టం.. ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభం చేకూరుతుందన్నారు. ఈ పథకం స్థానంలో కేంద్రం కొత్త పాలసీని తేవాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రజా తపన
prajathapana.com
















Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950